
కొండెక్కిన కూరగాయల ధరలు 7
ఆహ్లాదాన్ని పంచుతున్న హరితహారం వృక్షాలు 8
వెదురు సాగు.. బహు బాగు 7
గ్రామాల్లో పారిశుధ్య పనులు 8

ఆంధ్రజ్యోతి

సోమవారం ఉష్ణోగ్రత గరిష్ఠం 29.4, కనిష్ఠం 19.2



కామారెడ్డి జిల్లా వార్తలు

5 మంగళవారం 22 జూలై 2025



జుక్కల్ మండలం మందబాద్ శివారులో వరి తూకం ఎండిపోవడంతో ట్యాంకర్ ద్వారా నీరు పారిస్తున్న రైతు

'వరి'గోస

- ఊరించి ఉసురుమనిపించిన వర్షాలు
- ముదిరిపోతున్న వరి నారు
- ఆందోళనలో రైతులు

ఎల్లారెడ్డి/జుక్కల్, జూలై21(ఆంధ్రజ్యోతి): వర్షాల్లేక రైతులు ఆకాశం వంక చూస్తున్నారు. జూన్ మొదటి వారంలో రోహిణి కార్తీలో వర్షాలు కురవడంతో రైతులు ఎంతో సంబరపడి వరి నార్లు వేశారు. మొక్కజొన్న పసుపు కంది వంటి పంటలు వేసుకున్నారు. నార్లు పోసి నెల రోజులు దాటిపోవడంతో వరి నార్లు ముదిరిపోతోంది. రైతులు ఆందోళన చెందుతున్నారు.

ఆందోళనలో రైతులు

మండలంలో వాన కాలం సీజన్‌లో సుమారు 15వేల ఎకరాల్లో వరిపంటలు సాగు చేస్తుంటారని వ్యవసాయ అధికారుల అంచనా జూలై మాసం రెండో వారం వరకు దాదాపు 80 శాతం వరకు నాట్లు పూర్తయ్యేవి. కానీ ఇప్పటికీ కనీసం 20 శాతం కూడా నాట్లు వేయని పరిస్థితి. ప్రస్తుతం నారు పోసి నెల దాటిన వానలు కురవక సాగు చేసుకోలేక పోతున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

రైతన్న చూపు ఆకాశం వైపు

జుక్కల్ మండలం మందబాద్ శివారులో వరి తూకం ఎండిపోవడంతో రైతు నాయక్ సోమవారం గ్రామంలో ఉన్న బోరుబావి ద్వారా ట్యాంకర్‌లో నీళ్ల అందిస్తున్నాడు. వర్షాలు లేక వరి తూకం ఎండిపోతుందని దిగులు చెందుతున్నాడు ఎండాకాలంలో భారీ వర్షాలు కురిసి వర్షాకాలంలో చిన్న వర్షాలు సైతం కురవడం లేదని ఆవేదన వ్యక్తం చేశాడు. ట్యాంకర్ ద్వారా నీళ్ల పెట్టుకొని వరి నారును బతికించుకుంటే భారీ వర్షాలు పడినప్పుడు పొలంలో నాట్లు వేసుకుంటామని రైతుచందు నాయక్ తెలిపారు. రోజూ ఆకాశంలో మేఘాలు కనిపిస్తున్నప్పటికీ వర్షాలు కురవడం లేదు. వర్షాలు కురవాలని ఆలయాలు జలభిషేకం చేస్తున్నారు.



ఎల్లారెడ్డిలో ముదురుతున్న వరి నారు



భర్తీ ఎప్పుడో?

- ఖాళీగా అంగన్‌వాడీ టీచర్ పోస్టులు
- కేంద్రాలలో టీచర్లు, ఆయాల కొరత
- ఇబ్బందులు పడుతున్న బాలింతలు, గర్భిణీలు, పిల్లలు
- జిల్లాలో 99 అంగన్‌వాడీ టీచర్..433 ఆయాల పోస్టులు ఖాళీ
- ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలంటున్న విద్యార్థి సంఘాల నాయకులు

కామారెడ్డి, జూలై21 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో టీచర్, ఆయా పోస్టులు భర్తీ చేయకపోవడంతో ఆయా కేంద్రాల పరిధిలో బాలింతలు, గర్భిణులు, పిల్లలు ఇబ్బందులు పడుతున్నారు. టీచర్ పోస్టులు ఖాళీగా ఉన్న కేంద్రాల నిర్వహణ బాధ్యతను పక్క కేంద్రాల టీచర్లకు అప్పగించడంతో వారిపై అదనపు భారం పడుతోంది. దీంతో అంగన్‌వాడీ కేంద్రాలు సమస్యలకు నిలయంగా మారాయి. జిల్లావ్యాప్తంగా 1193 అంగన్‌వాడీ కేంద్రాలు ఉండగా ఇందులో 99 టీచర్, 433 ఆయాల పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఇటీవల జిల్లా ఇన్‌చార్జి మంత్రి అయిన రాష్ట్ర మహిళశిశుసంక్షేమశాఖమంత్రి సీతక్క అంగన్‌వాడి టీచర్ల, ఆయాల పోస్టులు భర్తీచేస్తామని చెప్పడంతో మహిళా నిరుద్యోగుల్లో ఆశలు రేకెత్తాయి. ఖాళీగాఉన్న పోస్టులను భర్తీచేస్తే అటు అంగన్‌వాడి కేంద్రాలకు వచ్చే వారికి మేలు జరగడమే కాకుండా ఇటు నిరుద్యోగులకు సైతం ఉపాధి కల్పించినట్లు అవుతుందని పలువురు అభిప్రాయ పడుతున్నారు. ప్రభుత్వం వెంటనే ఖాళీగాఉన్న పోస్టులను భర్తీచేయాలని విద్యార్థి సంఘాల నేతలే కాకుండా పలువురు సంఘాల నాయకులు డిమాండ్ చేస్తున్నారు.

ప్రాజెక్టుల వారిగా అంగన్‌వాడీ టీచర్ల ఖాళీల వివరాలు

క్రసం	ప్రాజెక్ట్	పోస్టులు	ఉన్నది	ఖాళీలు
1.	కామారెడ్డి	249	234	15
2.	దోమకొండ	238	220	18
3.	ఎల్లారెడ్డి	276	251	25
4.	బాన్సువాడ	222	203	19
5.	మద్నూర్	276	251	25

టీచర్లు, ఆయాలదే కీలక పాత్ర

ఐసీడీఎస్‌లో అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలదే క్షేత్రస్థాయిలో కీలక పాత్ర ఓవైపు స్వంత అంగన్‌వాడీ కేంద్రాల్లో గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు పౌష్టికాహారంతోపాటు పలు రకాల సేవలు అందిస్తు వైద్య ఆరోగ్య శాఖ కార్యక్రమాలలోనూ పాల్గొంటున్నారు. బూత్ లెవల్ అధికారులుగా ఎన్నికల విధుల్లో సేవలు అందిస్తున్నారు. ఖాళీలు భర్తీ అయితే ప్రస్తుతం ఉన్న అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలకు పనిభారం తగ్గడంతో పాటు కేంద్రాలలో గర్భిణులు, బాలింతలకు, పిల్లలకు మెరుగైన సేవలు అందే అవకాశం ఉంటుంది.

వెక్కిరిస్తున్న ఖాళీలు

జిల్లాలోని కామారెడ్డి, ఎల్లారెడ్డి, బాన్సువాడ, దోమకొండ, మద్నూర్‌లలో ఐదు ఐసీడీఎస్ ప్రాజెక్టులు ఉన్నాయి. ఈ ప్రాజెక్టుల పరిధిలో 1193 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. ఇందులో ప్రస్తుతం 1094మంది అంగన్‌వాడీ టీచర్లు, 760 మంది ఆయాలు తమ సేవలను అందిస్తున్నారు. అంగన్‌వాడీ కేంద్రాలకు తగ్గట్టుగా టీచర్లు, ఆయాల పోస్టులు ఖాళీగా ఉన్నాయి. జిల్లావ్యాప్తంగా 99 టీచర్, 433 ఆయాల పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఈ నేపథ్యంలో సిబ్బంది కొరత ఉన్న కేంద్రాలలో ఇన్‌చార్జ్‌లతో పాటు కార్యకలపాలు నిర్వహిస్తున్నారు. దీంతో గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు సరైన సేవలు అందడంలేదనే ఆరోపణలు వస్తున్నాయి.

చిగురిస్తున్న ఆశలు

జిల్లాలో ఇటీవల రాష్ట్ర మహిళా శిశుసంక్షేమశాఖ, ఇన్‌చార్జ్ మంత్రి సీతక్క పర్యటించి కలెక్టరేట్‌లోని పలు శాఖలపై సమీక్షించారు. ఈ సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా ఉన్న అంగన్‌వాడీ టీచర్ల, ఆయాల పోస్టులు త్వరలోనే భర్తీ చేయనున్నామని ప్రకటించారు. దీంతో నిరుద్యోగులైన



మహిళ అభ్యర్థుల్లో ఆశలు చిగురించాయి. ఎప్పుడు నోటిఫికేషన్ వస్తుందా అని ఎదురుచూస్తున్నారు. అంగన్‌వాడీ టీచర్ల, ఆయాల పోస్టులు భర్తీ చేస్తే 532 మంది మహిళా నిరుద్యోగులకు ఉపాధి లభించనుంది.

కేంద్రాలలో గర్భిణులు, బాలింతలు, పిల్లల వివరాలు

గర్భిణులు, బాలింతలు	- 12,484
7 నెలల నుంచి 3 సం. (పిల్లలు)	- 31,753
మూడేళ్ల నుంచి 6సం (పిల్లలు)	- 31,749

ప్రాజెక్టుల వారిగా ఆయాల ఖాళీల వివరాలు

క్రసం	ప్రాజెక్ట్	పోస్టులు	విధుల్లో ఉన్నవారు	ఖాళీలు
1.	కామారెడ్డి	249	177	72
2.	దోమకొండ	238	154	84
3.	ఎల్లారెడ్డి	276	162	114
4.	బాన్సువాడ	222	140	82
5.	మద్నూర్	276	127	81



వీడియోకాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్, అధికారులు

సీజనల్ వ్యాధుల నివారణకు చర్యలు

- వీసీలో కలెక్టర్‌కు సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాలు

కామారెడ్డి టౌన్, జూలై 21 (ఆంధ్రజ్యోతి): సీజనల్ వ్యాధుల నివారణకు చర్యలు చేపట్టాలని, భారీ వర్షాల వల్ల జరిగే ప్రమాదాలను నివారించడానికి డిజాస్టర్ మేనేజ్‌మెంట్ సేవలు వినియోగించుకోవాలని సీఎం రేవంత్‌రెడ్డి కలెక్టర్‌లను ఆదేశించారు. సోమవారం మంత్రివర్గ సహచరులతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రేషన్ కార్డుల పంపిణీ, సీజనల్ వ్యాధుల నియంత్రణ తదితర అంశాలపై మాట్లాడారు. జిల్లాలో వర్షాపాతం ముందుగానే తెలుసుకుని 3 గంటల ముందు వర్షపాతం అధికంగా గల ప్రాంతాల్లో తగిన ప్రమాద నివారణకు చర్యలు చేపట్టాలని తెలిపారు. కమాన్ కంట్రోల్ యూనిట్ ద్వారా పర్యవేక్షణ చేయాలని సూచించారు. సీజనల్ వ్యాధుల నివారణ పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని దోమల నివారణ, నీటి నిల్వలు లేకుండా చూడాలని తెలిపారు. ప్రతీ మండలస్థాయిలో ప్రాథమిక ఆరోగ్యకేంద్రాల్లో, ఏరియా, జిల్లా ఆసుపత్రులలో అందరూ సిబ్బంది అందుబాటులో ఉండేలా చూడాలని తెలిపారు. ఆసుపత్రులను ఆకస్మిక తనిఖీలు చేపట్టి వైద్యుల హాజరును పర్యవేక్షించాలని కలెక్టర్‌లకు ఆదేశించారు. జిల్లాలో ఎరువుల దుకాణాల వద్ద ప్రతీ రోజు స్టాక్ పరిస్థితిని నోటీసు బోర్డుల ద్వారా ప్రదర్శించాలని స్టాక్ పరిస్థితిని కలెక్టర్‌లు ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని తెలిపారు. ప్రభుత్వం ద్వారా సరాఫరా చేస్తున్న సబ్సిడీ యూరియాను వ్యవసాయ అవసరాలకు కాకుండా ఇతర వ్యవసాయేతర అవసరాలకు వాడుతున్నట్లు ప్రభుత్వం దృష్టికి వచ్చిందని ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి తగినచర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈనెల 25 నుంచి వచ్చే నెల 14 వరకు రేషన్ కార్డుల పంపిణీ జరిగేలా చూడాలని తెలిపారు. అనంతరం కలెక్టర్ ఆశీష్ సాంగ్వాన్‌అధికారులతో సమావేశం ఏర్పాటుచేసి జిల్లాలో గల ఎరువుల డీలర్ల యొక్క పూర్తివివరాలు సేకరించాలని తెలిపారు. రేషన్‌కార్డుల పంపిణీకి మండలాల వారిగా కార్యక్రమాలు ఏర్పాటుచేసి నియోజకవర్గ ఎమ్మెల్యేల ద్వారా రేషన్‌కార్డుల పంపిణీ కార్యక్రమం నిర్వహించాలని తెలిపారు. జిల్లాలో యూరియా వ్యవసాయేతర అవసరాలకు వినియోగిస్తున్న వారిని గుర్తించి వారిపై తగిన చర్యలు చేపట్టడానికి మండల స్థాయిలో టాస్క్‌ఫోర్స్ కమిటీని ఏర్పాటుచేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో బాన్సువాడ సబ్ కలెక్టర్ కిరణ్మయి, అదనపు కలెక్టర్లు చందర్‌నాయక్, విక్టర్ తదితరులు ఉన్నారు.



వివరాలు వెల్లడిస్తున్న ఏఎస్పీ చైతన్యరెడ్డి

దారి దోపిడీకి పాల్పడిన ముగ్గురు నిందితుల అరెస్ట్

కామారెడ్డిటౌన్, జూలై 21(ఆంధ్రజ్యోతి): జిల్లాకేంద్రంలో దారి దోపిడీకి పాల్పడుతున్న వ్యక్తులను అరెస్ట్ చేసినట్లు ఏఎస్పీ చైతన్యరెడ్డి సోమవారం తెలిపారు. కేసు వివరాలను ఏఎస్పీ వెల్లడించారు. ఈనెల 19న దోమకొండ మండలం చింతమన్‌పల్లి గ్రామానికి చెందిన సార్ల చిన్న గంగయ్యను జిల్లాకేంద్రంలోని దుబ్బగౌడ్ కల్లు దుకాణంలో ఓ మహిళ క్యాసంపల్లి వరకు లిఫ్ట్ ఇవ్వండని కోరింది. గంగయ్య, సదరు మహిళ బండిపై వెళ్తుండగా మార్గం మధ్యలో నవాబ్ వెంచర్ దాటిన తర్వాత ఆ మహిళ బండి ఆపమని చెప్పడంతో గంగయ్య బండి ఆపాడు. దీంతో అక్కడికి ఇద్దరు వ్యక్తులు వచ్చి అతనిపై దాడి చేసి అతని వద్ద ఉన్న రూ.28వేలను ఎత్తుకెళ్లారు. గంగయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసుకుని దర్యాప్తు చేయగా పల్వంచ మర్రి వద్ద నివాసం ఉండే కడమంచి లక్ష్మీ, షేక్ జావిద్, కామారెడ్డి మండలం నర్సన్నపల్లికి చెందిన షేక్ అబ్బులు పథకం ప్రకారం దారి దోపిడీ చేసినట్లు నిర్ధారణ అయినట్లు తెలిపారు. నిందితులను అరెస్ట్‌చేసి వారి వద్ద రూ.14,700 నగదు, నేరానికి ఉపయోగించిన ద్విచక్రవాహనాన్ని స్వాధీనం చేసుకున్నట్లు ఏఎస్పీ తెలిపారు.

సైబర్ మోసానికి రూ.30వేలు పోగొట్టుకున్న రైతు

లింగంపేట, జూలై21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పర్మల్ల గ్రామానికి చెందిన మరిపల్లి సాయాగౌడ్ సోమవారం సైబర్ నేరగాళ్ల మోసానికి రూ.30,500 పోగొట్టుకునట్టు ఎస్సై దీపక్ కుమార్ తెలిపారు. ఫేస్‌బుక్‌లో ముద్రలోన్ లింక్‌ను చూసిన సాయాగౌడ్ దాన్ని ఓపెన్ చేశాడని, అందులోని నెంబర్‌కు ఫోన్‌చేయగా 'మీకు రూ.15లక్షల లోన్ ఎలిజిబిలిటీ ఉంది. ప్రాసెసింగ్ చార్జీకింద కొంతడబ్బు కట్టాలి' అని చెప్పడంతో నమ్మి రూ.6,500 కట్టాడు. మోసగాళ్లు చెప్పినట్లు మరోసారి రూ.24వేలు చెల్లించాడు. మళ్లీ రూ.49వేలు చెల్లించాలని చెప్పడంతో తాను మోసపోయానని సాయాగౌడ్ గ్రహించి సైబర్ పోలీసులకు 1930కి ఫోన్ చేసినట్లు వెల్లడించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. సైబర్ నేరగాళ్ల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఆయన సూచించారు.



జన్మదిన వేడుకలను జరుపుకొంటున్న నాయకులు

ఘనంగా ఏఐసీసీ అధ్యక్షుడి జన్మదిన వేడుకలు

కామారెడ్డిటౌన్, జూలై21 (ఆంధ్రజ్యోతి): జిల్లాకేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో సోమవారం కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా టీపీసీసీ జనరల్ సెక్రటరీ గడ్డం చంద్రశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి ఒకరికొకరు తినిపించుకున్నారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ దేశం కోసం చేసిన సేవలు, ప్రతి ఒక్కరికీ పార్టీలో ఇచ్చే స్థానంపై వివరించారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్‌లు జూలూరి సుధాకర్, చాట్లవంశీకృష్ణ, పిడుగు మమతసాయిబాబా, బండారి శ్రీకాంత్, కనపర్తి అరవింద్, యూత్ సభ్యులు మహేష్, మున్నా, పండుశ్రీకాంత్, శశి, శివ, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఖర్గేకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన షబ్బీర్ అలీ

ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గేకు సోమవారం ప్రభుత్వ సలహాదారుడు షబ్బీర్‌అలీ జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. మల్లికార్జున్ ఖర్గే మరింత రెట్టింపు ఉత్సాహంతో ఆయురారోగ్యాలతో ఉంటూ కాంగ్రెస్ పార్టీకి నిర్ధేశం చేయాలని చెప్పారు. భారత ప్రజల కోసం పోరాటం చేయడంలో ఆయన నాయకత్వం, నిబద్ధత, అంకితభావం ఎల్లప్పుడు అందరికీ స్ఫూర్తినిస్తాయని పేర్కొన్నారు.

స్వచ్ఛతలో దిగజారిన ర్యాంకులు

- కామారెడ్డి మునిసిపాలిటీకి 36వ స్థానం
- గతేడాది పోలిస్తే పడిపోయిన ర్యాంకు
- కాస్త మెరుగైన బాన్సువాడ, ఎల్లారెడ్డి
- స్వచ్ఛత యాప్‌పై అవగాహన కరువు



కామారెడ్డిటౌన్, జూలై21 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని మునిసిపాలిటీలు స్వచ్ఛ సర్వేక్షణ్‌లో వెనుకబడుతూనే ఉన్నాయి. జిల్లాలో గతంలో కామారెడ్డి, ఎల్లారెడ్డి, బాన్సువాడ మునిసిపాలిటీలు ఉండగా ఇటీవల బిచ్కుంద మునిసిపాలిటీలు ఏర్పడింది. జిల్లా ఏర్పడకముందు నుంచే కామారెడ్డి మునిసిపాలిటీలు ఉండగా జిల్లాఏర్పాటు అనంతరం ఎల్లారెడ్డి, బాన్సువాడ మునిసిపాలిటీలుగా అవతరించాయి. జిల్లాకు పెద్దన్నలా వ్యవహరిస్తూ ఇతర మునిసిపాలిటీలకు ఆదర్శంగా నిలవాల్సిన కామారెడ్డి మునిసిపాలిటీ ర్యాంకు పడిపోయింది. గతేడాదితో దిగజారింది. ఇక బాన్సువాడ, ఎల్లారెడ్డి మునిసిపాలిటీలు గతంలో కంటే ఇప్పుడు కాస్త మెరుగైన ర్యాంకును సాధించుకున్నాయి. ఈ ర్యాంకుల ఆధారంగానే నిధుల విడుదల జరగనుండడం విశేషం. గతంలో జోనల్, రాష్ట్రస్థాయి ర్యాంకులు ఉండగా ఈసారి జాతీయ, రాష్ట్రస్థాయి ర్యాంకులు ప్రకటించారు.

అధికారుల పర్యవేక్షణ కరువు

వార్డు ఆఫీసర్లు నామమాత్రపు విధుల నిర్వహణ, మునిసిపల్ మున్సిపల్ సిబ్బందికి పనులు కేటాయించడంలో జవాన్లు నామమాత్రంగానే ఉండడంతో ఎక్కడ వేసిన చెత్త అక్కడే ఉండడం, పోదల తొలగింపు, పారిశుధ్య నిర్వహణలో లోపాలు, ప్రజలకు అవగాహన కార్యక్రమాలు కరువై ఇలా అనేక రకాల సమస్యలతో కామారెడ్డి మునిసిపాలిటీ కొట్టుమిట్టతోంది. ఇలా అయితే స్వచ్ఛత ర్యాంకులో వెనుకబడక ముందుకు ఎలా వస్తుందనే వాదనలు వినిపిస్తున్నాయి.

కామారెడ్డికి 36 వ స్థానం

గతేడాది రాష్ట్రస్థాయిలో స్వచ్ఛసర్వేక్షణ్‌లో 12వ ర్యాంకు సాధించగా ఈ ఏడాది కామారెడ్డి మునిసిపాలిటీకి 36వ స్థానం దక్కింది. బాన్సువాడకు గతంలో 54వ ర్యాంకు ఉండగా ఈసారి 46, ఎల్లారెడ్డికి 117వ స్థానం ఉండగా ఈసారి 67వ ర్యాంకుకు చేరింది. కామారెడ్డి మునిసిపాలిటీ పూర్తిగా వెనుకబడగా బాన్సువాడ, ఎల్లారెడ్డిలు కాస్త మెరుగు అనిపించాయి. స్వచ్ఛ సర్వేక్షణ్‌లో మునిసిపాలిటీ మెరుగైన ర్యాంకు సాధించడంలో అధికార యంత్రాంగంతో పాటు పట్టణ ప్రజల భాగస్వామ్యం ఎంతో కీలకం. ప్రజల అభిప్రాయాలు తెలుసుకునేందుకు ప్రభుత్వం ప్రత్యేకంగా స్వచ్ఛత యాప్ రూపొందించింది. ఈ యాప్ డౌన్‌లోడ్ చేసుకుంటే ఒక మార్కు, ఫిర్యాదు నమోదైన వెంటనే పరిష్కరిస్తే రెండు మార్కులు, 6గంటల సమయం దాటిన తర్వాత సమస్యను పరిష్కరిస్తే మార్కు కేటాయిస్తారు. అయితే ఈ యాప్ వినియోగంపై ప్రజలకు అవగాహన అనేదేలేదు. దాదాపు 100మందిని తీసుకుంటే అందులో 10 మంది దగ్గర కూడా ఈ యాప్ లేదంటే అధికారుల పనితీరును అర్థం చేసుకోవచ్చు.

కామారెడ్డి మున్సిపాలిటీలో అంతంతే..

కామారెడ్డి మున్సిపాలిటీలో స్వచ్ఛత అంతంతమాత్రంగానే జరుగుతోంది. కొత్తపట్టణంలో కొద్దిమేర మెరుగైన (మిగతా 8లో..)

పాముల కాలం.. జర జాగ్రత్త! 7
- వానాకాలంలో పొంచి ఉన్న ముప్పు
- విష పురుగులతో ప్రాణాపాయం
- జాగ్రత్తలు తప్పనిసరి

పాఠశాలల్లో ఘనంగా బోనాల పండుగ



ఆర్మూర్‌లో బోనాలు ఎత్తుకున్న చిన్నారులు

ఆర్మూర్‌టౌన్, జూలై 21 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని స్మైల్‌దిస్కూల్ చిన్నారులు, ఉపాధ్యాయులు ఘనంగా బోనాల పండుగను నిర్వహించారు. ఉపాధ్యాయులు, చిన్నారులు బోనాలను ఎత్తుకొని మహాలక్ష్మీ ఆలయంలో బోనాలను సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సిందూర, సిందుజ, ప్రసన్న, శ్రావణి, స్వప్న పాల్గొన్నారు.

భీమ్‌గల్ : పట్టణ కేంద్రంలోని శ్రీ సరస్వతి విద్యా మదిర్ పాఠశాలలో సోమవారం బోనాల పండుగను ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా పాఠశాల చిన్నారులు, మహిళా ఉపాధ్యాయునిలు బోనాలు ఎత్తుకొని విద్యార్థులు పోతరాజుల వేషధారణతో ఊరేగింపుగా బస్టాండ్ మీదుగా నంది గల్లిలోని పోచమ్మ ఆలయ వద్దకు చేరుకొని అమ్మవారికి ప్రత్యేక పూజలు జరిపించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రవికుమార్, అడ్మినిస్టేట్ ఆఫీసర్ నర్సారెడ్డి, అకాడమిక్ ఇంచార్జి , మహిళా ఉపాధ్యాయుణిలు, విద్యార్థులు పాల్గొన్నారు.

బోధన్ : బోధన్ పట్టణంలోని ఉషోదయ మహిళ డిగ్రీ కళాశాలలో సోమవారం విద్యార్థులు, అధ్యాపక బృందం బోనాల పండుగను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ సమత ముఖ్య అతిథిగా హజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తెలంగాణలో బోనాల పండుగ చాలా విశిష్టమైనదని బోనాల పండుగ సాంస్కృతి, సంప్రదాయాలను, విశిష్టతను విద్యార్థులకు వివరించారు. అనంతరం బోనాల పండుగను నిర్వహించారు. గ్రామ దేవతలకు పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విద్యాసంస్థల చైర్మన్ సూర్యప్రకాష్, దుశ్యంత్, కళాశాల ప్రిన్సిపాల్ గంగాధర్, హరికృష్ణ, అధ్యాపక బృందం తదితరులు పాల్గొన్నారు.



బోధన్‌లో బోనాల పండుగ దృశ్యం



భీమ్‌గల్‌లో బోనాలు ఎత్తుకున్న విద్యార్థులు

వ్యక్తిత్వ వికాస తరగతులు నిర్వహించాలి

● వసతి గృహం సందర్శన ● ఎమ్మెల్యే రాకేష్‌రెడ్డి



గురుకుల పాఠశాలలో రిజిస్టర్ తనిఖీ చేస్తున్న ఎమ్మెల్యే

ఆర్మూర్ , జూలై 21 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు వ్యక్తిత్వ వికాస తరగతులు నిర్వహించాలని ఎమ్మెల్యే రాకేష్‌రెడ్డి ఉపాధ్యాయులకు సూచించారు. సోమవారం ఆర్మూర్‌లోని వేల్పూర్ సాంఘిక సంక్షేమ వసతి గృహాన్ని సందర్శించారు. ఇటీవల విద్యార్థి గడ్డం సంతోష్ ఆత్మహత్యకు గల కారణాలను ఉపాధ్యాయుల, విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ఉపాధ్యాయుల హాజరు పట్టికను పరిశీలించారు. వసతిగృహంలోని సౌకర్యాలు, విద్యార్థులకు అందించే ఆహారం, నాణ్యతను అడిగి తెలుసుకున్నారు. సమస్యలుంటే తమ దృష్టికి తీసుకురావాలన్నారు.

పుప్పాల రాజేందర్ సంస్మరణ సభ

కొటార్మూర్‌లో విశాఖకాలనీలో సోమవారం జరిగిన పుప్పాల రాజేందర్ సంస్మరణ సభకు ఎమ్మెల్యే రాకేష్‌రెడ్డి హాజరయ్యారు. రాజేందర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ రాజేందర్ ఆర్‌ఎస్ఎస్ పట్ల అంకితభావంతో పనిచేసేవాడని హిందువుల పక్షాన నిలబడేవారని కొనియాడారు. ఆయన మృతి ఆర్మూర్ ప్రాంతంలో ఆర్‌ఎస్ఎస్‌కు తీరని లోటన్నారు. కార్యక్రమలో ఆర్ఎస్ఎస్ ప్రాంత ప్రచారక్ సుధాకర్‌రెడ్డి, వాసుజీ, గణేష్‌జీ , బీజేపీ నాయకులు లోక భూపతిరెడ్డి, జాతీయ పసుపుబోర్డు చైర్మన్ పల్లె గంగారెడ్డి, శివరాజ్‌కుమార్, బీజేపీ అధికార ప్రతినిధి కలిగోట గంగాదర్, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సిద్దుల గుట్టపై ప్రత్యేక పూజలు



సిద్దుల గుట్టపై పల్లకి సేవలో పాల్గొన్న భక్తులు

పెర్కిట్, జూలై 21 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని నవనాథ సిద్దుల గుట్టపై సోమవారం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై శివాలయంలో పంచామృతాలతో బిల్వ పత్రాలతో సిద్దేశ్వరునికి అభిషేకం చేశారు. అయ్యప్ప, రామాలయం, దుర్గామాత, ఏకశిల స్తంభం వద్ద గల అంజనేయ స్వామి ఆలయంలో భక్తులు పూజలు నిర్వహించారు. నందీశ్వర మహారాజ్ ఆధ్వర్యంలో నిర్వహించిన పల్లకీసేవలో భక్తులు ఆర్మూర్ భజన మండలి భక్తులు పాల్గొని పాటలు పాడుతూ నృత్యాలు చేశారు. భక్తుల సహాయ సహకారాలతో ప్రతీ సోమవారం నిర్వహించే అన్నప్రసాద కార్యక్రమంలో భక్తులు పాల్గొని ప్రసాదం స్వీకరించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు బి.సుమన్, పీసీ గంగారెడ్డి, కొడిగల మల్లయ్య, బోండ్ల ఆనంద్, ప్రశాంత్ గౌడ్, చందేవి శ్రీనివాస్, కాంగ్రెస్ నాయకులు రవీందర్ రెడ్డి, మామిడిపల్లి మాజీసర్పంచ్ మారుతి రెడ్డి, ఆలయ అర్చకులు కుమార శర్మ, సిద్దుల గుట్ట సేవా సమితి సభ్యులు పాల్గొన్నారు.

వ్యసనాలకు దూరంగా ఉండాలి

● స్కైరోస్ చైర్మన్ ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్



మాట్లాడుతున్న ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్

ఆర్మూర్‌టౌన్, జూలై 21 (ఆంధ్రజ్యోతి): యువత చెడువ్యసనాలకు దూరంగా ఉండి ఉన్నత స్థాయి లక్ష్యాలను ఏర్పాటు చేసుకోవాలని స్కైరోస్ చైర్మన్ ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ అన్నారు. ఆర్మూర్ పట్టణంలోని క్షత్రియఫంక్షన్ హాల్‌లో స్కైరోస్ శిక్షణ తరగతులు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ ప్రపంచమంత కృత్రిమమేధస్సు వైపు వెళ్తున్న ఈ రోజుల్లో మనం వాటిని అందిపుచ్చుకొని గొప్ప స్థాయికి రావాలని పిలుపు నిచ్చారు. కార్యక్రమంలో స్కైరోస్ చీఫ్ కన్వీనర్ బలుగురి దుర్గయ్య వైస్ చైర్మన్ బాల ప్రసాద్, స్కైరోస్ రాష్ట్ర అధ్యక్షుడు వీరయ్య, మల్లన్న, ప్రధాన కార్యదర్శి ప్రకాష్, రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ సాయి, దేవన్న, జైపాల్, లక్ష్మణ్, హరీష్ తదితరులు పాల్గొన్నారు.

టీపీసీసీ అధ్యక్షుడిని కలిసిన డీసీసీబీ చైర్మన్



పీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్‌ను కలిసిన డీసీసీబీ చైర్మన్ రమేష్‌రెడ్డి

వేల్పూర్, జూలై 21 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ పీసీసీ అధ్యక్షుడు బొమ్మ మహేష్‌కుమార్ గౌడ్‌ను నిజామాబాద్ ఉమ్మడి జిల్లా సహకార అధ్యక్షుడు కుంట రమేష్‌రెడ్డి సోమవారం హైదరాబాద్‌లో మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఉమ్మడి నిజామాబాద్ జిల్లా సహకార బ్యాంక్ అభివృద్ధి పనితీరును మహేష్‌కమార్ గౌడ్‌కు డీసీసీబీ చైర్మన్ రమేష్‌రెడ్డి వివరించారు. అతి తక్కువ కాలంలో సహకార బ్యాంక్ ఇంతగా అభివృద్ధి చెందినందుకు గాను పీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్ ప్రత్యేకంగా రమేష్‌రెడ్డిని అభినందించారు. మహారాష్ట్రంలో సహకార బ్యాంక్‌లు రైతులకు బహుళసేవలు అందిస్తున్నాయని త్వరలో ఆ రాష్ట్రంలో పర్యటించి సహకార వ్యవస్థను అధ్యాయనం చేసి మన రాష్ట్రంలో కూడా అటువంటివి అమలు చేయాలని మహేష్‌కుమార్‌గౌడ్ రమేష్‌రెడ్డికి సూచించారు.

కోటగిరి ఉమ్మడి మండలానికి 945 రేషన్ కార్డులు

కోటగిరి, జూలై 21 (ఆంధ్రజ్యోతి): కోటగిరి ఉమ్మడి మండలానికి కొత్తగా 945 రేషన్‌కార్డులు ప్రభుత్వం జారీ చేసిందని తహసీల్దార్ గంగాధర్ తెలిపారు. మండలానికి 528 రేషన్‌కార్డులు రాగా పొతంగల్ మండలానికి 417 రేషన్ కార్డులు వచ్చాయని అధికారులు పేర్కొన్నారు. మంగళవారం బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి చేతుల మీదుగా లబ్ధిదారులకు పంపిణీ చేయనున్నట్లు తహసీల్దార్ వివరించారు.

నేడు వర్నిలో రేషన్‌కార్డుల పంపిణీ

వర్ని, జూలై 21 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో మంగళవారం కొత్త రేషన్ కార్డుల పంపిణీ జరుగనుంది. బాన్సువాడ ఎమ్మెల్యే పోచా రం శ్రీనివాస్‌రెడ్డి, రాష్ట్ర ఆగ్రోస్ ఇండస్ట్రీస్ చైర్మన్ కాసుల బాలరాజ్ ఈ కార్డులను పంపిణీ చేయనున్నారు. వర్ని, కోటగిరి, పొతంగల్, రుద్రూరు, చందూర్, మోస్రా మండలాలకు చెందిన లబ్దిదారులు అవకాశాన్ని వినియోగించుకోవాలని తహసీల్దార్ సాయిలు కోరారు.

క్రైం సమాచారం

సౌదీ వెళ్తున్నానని చెప్పిన వ్యక్తి అదృశ్యం



గణేష్

నవీపేట, జూలై 21 (ఆంధ్రజ్యోతి): సౌదీ వెళ్తున్నానని చెప్పిన నిజామాబాద్ మండలం పాల్దాకు చెందిన చిన్నోళ్ల గణేష్ అనే వ్యక్తి ఆచూకీ లేదని ఎస్ఐ వినయ్ తెలిపారు. రెండున్నర నెలల క్రితం గణేష్ తండ్రి లస్మన్న అనారోగ్యంతో మృతిచెందగా సౌదీ నుంచి స్వగ్రామానికి వచ్చాడని ఆయన పేర్కొన్నారు. తిరిగి ఈ నెల 4న సౌదీవెళ్తున్నానని చెప్పి వెళ్లిన గణేష్ సౌదీకి చేరుకోలేదని ఆయన వివరించారు. ఈ విషయంపై భార్య స్రవంతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

యువకుడి అదృశ్యం

రామారెడ్డి, జూలై 21 (ఆంధ్రజ్యోతి): రామారెడ్డి పోలీస్‌స్టేషన్ పరిధిలోని గిద్ద గ్రామంలో ఓ యువకుడు అదృశ్యమైనట్లు రామారెడ్డి ఎస్సై లావణ్య సోమవారం తెలిపారు. ఎస్ఐ కథనం ప్రకారం.. గిద్ద గ్రామానికి చెందిన 35ఏళ్ల మావురుగల్ల నవీన్ అనే యువకుడు ఈనెల 19న రాత్రి భార్య సౌజన్యతో గొడవపడ్డాడు. కోపంతో ఇంట్లో నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. నవీన్ కనిపిస్తే 87126 86152 ఫోన్‌నెంబర్‌కు సమాచారం ఇవ్వాల్సిందిగా ఎస్సై తెలిపారు. నవీన్ కోసం బంధువుల ఇళ్లలో వెతికినా దొరకపోవడంతో సోమవారం నవీన్ అదృశ్యమైనట్లు తల్లి మావూరుగల్ల లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై లావణ్య తెలిపారు.

'అక్రమంగా ఇసుకను తరలిస్తే చర్యలు'



నాళేశ్వర్‌లో గ్రామస్థులతో మాట్లాడుతున్న ఎస్ఐ వినయ్

నవీపేట, జూలై 21(ఆంధ్రజ్యోతి): మండలంలోని నాళేశ్వర్ వాగు నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తే తగినచర్యలు తీసుకుంటామని ఎస్ఐ వినయ్ హెచ్చరించారు. సోమవారం మండలంలోని నాళేశ్వర్‌లో గ్రామస్థులతో సమావేశం ఏర్పాటు చేశారు. సైబర్‌నేరాలు, గంజాయిని అరికట్టడంలో పోలీసులకు సహకరించాలని, మత్తుపదార్థాల విషయంలో ఏదైనా సమాచారం తెలిస్తే డయల్ 100, నవీపేట పోలీస్‌స్టేషన్‌కు గాని సమాచారం అందించాలని కోరారు. కార్యక్రమంలో పలువురు గ్రామస్థులు, పోలీసుసిబ్బంది పాల్గొన్నారు.

జెండా జాతరకు ఏర్పాట్లు

ఆర్మూర్ టౌన్, జూలై 21 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో జరిగే జెండా బాలాజీ మందిరంలో సర్వసమాజ్ ప్రజా ఐక్యసమితి ఆధ్వర్యంలో జరిగే జెండా జాతరకు ఏర్పాట్లు చేస్తున్నట్లు సర్వసమాజ్ అధ్యక్షుడు కొట్బాల సుమన్, కార్యదర్శి కర్తన్ దినేష్‌లు తెలిపారు. సోమవారం జెండా బాలాజీ మందిరంలో జెండా జాతరకు సంబంధించిన బట్ట పూజకు శాస్త్రోత్తంగా నిర్వహించారు. ఈనెల 26న చిన్నజెండా, 27న పెద్ద జెండా మం దిర ఆవరణలో ప్రతిష్ఠాపన చేసి 9 రోజుల పాటు పూజలనందుకొని జాతర నిర్వహిస్తామని సర్వసమాజ్ అధ్యక్ష, కార్యదర్శులు కొట్బాల సుమన్, కర్తన్ దినేష్‌కు తెలిపారు. ఈ కార్యక్రమలో సర్వసమాజ్ సభ్యులు వెంకటేశ్వర్ ఆలయ కమిటి సభ్యులు, పలు కుల సంఘాల అధ్యక్ష కార్యదర్శులు పాల్గొన్నారు

రెడ్డి సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక



బోధన్ డివిజన్ రెడ్డి సంఘం నూతన కార్యవర్గం దృశ్యం

బోధన్,జూలై21(ఆంధ్రజ్యోతి): బోధన్ పట్టణంలోని రైస్‌మిల్ అసోసియేషన్ భవన్‌లో సోమవారం బోధన్ డివిజన్ రెడ్డి సంఘం నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా పోతడి గోపాల్ రెడ్డి, గౌరవ అధ్యక్షులు తలకోటి సాంబిరెడ్డి, ముఖ్య సలహదారులుగా తూము శరత్ రెడ్డి, ఉపాధ్యక్షులుగా చల్ల ధనుంజయ్ రెడ్డి, చిన్నోళ్ల సంజీవ్ రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా గడ్డం లక్ష్మణ్ రెడ్డి, జాయింట్ సెక్రెటరీగా కోట గిరారెడ్డిలతో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు.

జలాల్‌బుకారి దర్గా ఉర్సు ఉత్సవ కమిటీ ఎన్నిక



జలాల్ బుకారి దర్గా ఉర్సు ఉత్సవ కమిటీ దృశ్యం

బోధన్, జూలై 21 (ఆంధ్రజ్యోతి): బోధన్ పట్టణంలోని ప్రసిద్ధి గాంచిన జలాల్ బుకారి దర్గా ఉర్సు ఉత్సవ కమిటీని సోమవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా ఖాజాషర్ఫోద్దీన్, సెక్రెటరీగా ఎం.యూనూస్ పటేల్, ట్రెజరర్‌గా ఎం.హైమద్, ఉపాధ్యక్షులుగా సనా పటేల్, రహీంఖాన్, సోఫియాన్, ఖాజా ఎన్‌ఆర్ఐ, అలీబేగ్, కరీం రజా, ముఖ్యసలహాదారులుగా మీర్‌ఇలియాజ్ అలీ, జాయింట్ సెక్రెటరీగా షేక్‌హుస్సేని, జాకీర్ హుస్సేన్, అబ్దుల్‌కలీం, అద్నాన్, ఇంతియాజ్, మొసిన్‌లతో నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

నేడు బీజేపీ మండల కార్యకర్తల సమావేశం

నవీపేట, జూలై 21 (ఆంధ్రజ్యోతి): మండల భారతీయ జనతా పార్టీ కార్యకర్తల సమావేశాన్ని మంగళవారం మండలంలోని పోతంగల్‌లో నిర్వహించనున్నట్లు బీజేపీ మండల ప్రధానకార్యదర్శులు రాజేందర్ గౌడ్, నీరడి భూషణ్‌లు తెలిపారు. మధ్యాహ్నం 2 గంటలకు పోతంగల్‌లోని ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో ఈ సమావేశాన్ని ఏర్పాటు చేశామన్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని ఈ సమావేశాన్ని ఏర్పాటు చేశామన్నారు. సమావేశానికి బీజేపీ కార్యవర్గ సభ్యులు, నిజామాబాద్ జిల్లా ఎన్నికల కన్వీనర్ పీ.మోహన్‌రెడ్డి, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి లక్ష్మీనారాయణ, బీజేపీ మండల అధ్యక్షులు సరిన్‌లు హాజరుకానున్నారని వారు పేర్కొన్నారు. కార్యక్రమానికి మండలంలోని అన్ని గ్రామాలకు చెందిన నాయకులు, కార్యకర్తలు, బూత్ అధ్యక్షులు, శక్తి కేంద్రాల ఇన్‌చార్జులు హాజరుకావాలని వారు పేర్కొన్నారు.

సీఎమ్ఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ



దోంచందలో చెక్కు అందజేస్తున్న నాయకులు

ఏర్గట్ల/డొంకేశ్వర్/ముప్కాల్/ఆలూర్, జులై 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దోంచంద గ్రామానికి చెందిన పాట లక్ష్మీకి ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి మం జూరై న 24 వేల చెక్కును సోమవారం కాంగ్రెస్ నాయకులు రవి రెడ్డి అందజేశారు. చెక్కు మం జూరుకు కృషిచేసిన రాష్ట్ర యూనియన్ కార్పొరేషన్ చైర్మన్ మానాల మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

డొంకేశ్వర్ : మండలంలోని తొండాకూర్ గ్రామంలో సోమవారం సీఎంఆర్ఎఫ్ చెక్కులను మం డల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు భూమేష్‌రెడ్డి లబ్ధిదారులకు పంపిణీ చేశారు. తొం డాకూర్ గ్రామానికి చెందిన షేక్ అబ్బాస్‌కు రూ.60వేలు, అలాగే మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన జంగాల అనితకు రూ.2500 వేలు, లక్ష్మీనారాయణకు రూ.60వేలు, మంతెన పద్మకు రూ.40వేల చెక్కులను లబ్ధిదారులు అందజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, కాంగ్రెస్ పార్టీ ప్రధానకార్యదర్శి వైఎస్ గంగాధర్, దశాగౌడ్, దేవన్న, తదితరులు పాల్గొన్నారు.

ముప్కాల్ : మండలంలోని రెంజర్ల గ్రామానికి చెందిన బాధిత కుటుంబాలకు మంజూరైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మగ్గిడి ముత్యంరెడ్డి బాధిత కుటుంబాలకు సోమవారం అందజేశారు. కార్యక్రమంలో డీసీసీ జిల్లా ఉపాధ్యక్షుడు గడ్డం చిన్నారెడ్డి, కాం గ్రెస్ సీనియర్ నాయకులు షరిఫ్, శేషాద్రి, గూం డ్లసాగర్, రమేష్, ప్రదీప్, స్వర్గన్ పాల్గొన్నారు.

ఆలూర్ : మండలంలోని గుత్పలో సోమవారం సీఎంఆర్ఎఫ్ చెక్కులను లబ్ధిదారులకు కాంగ్రెస్ నాయకులు పంపిణీ చేశారు. రాస సుశీల, రవితేజ, గడ్డం శోభలు ఇటీవల అనారోగ్యానికి గురై ఆసుపత్రిలో చికిత్స పొందారు. ప్రభుత్వం వీరికి సీఎంఆర్ఎఫ్ చెక్కులను మంజూరు చేసింది. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు శశికుమార్, రవిగౌడ్, భూమేశ్వర్, ప్రసాద్, విజయ్‌గౌడ్, సాయికుమార్, గంగాధర్, నవీన్ పాల్గొన్నారు.



డొంకేశ్వర్‌లో చెక్కులు పంపిణీ చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తాచాటాలి

● బీఆర్ఎస్ నాయకుడు జుబేర్



కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకులు జుబేర్

కోటగిరి, జూలై 21 (ఆంధ్రజ్యోతి): వచ్చే స్థానికసంస్థల ఎన్నికలలో బీఆర్ఎస్ పార్టీ సత్తాచాటేలా కార్యకర్తలు కృషిచేయాలని బాన్సువాడ నియోజకవర్గ బీఆర్ఎస్ నాయకులు జుబేర్ పేర్కొన్నారు. మండల కేంద్రంలో బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తల విస్తృతస్థాయి సమావేశం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికలలో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందన్నారు. ప్రభుత్వంపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత నెలకొందన్నారు. స్థానిక సంస్థల ఎన్నికలలో బీఆర్ఎస్ పార్టీ సత్తాచాటేలా కార్యకర్తలు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు శ్రీనివాస్ గౌడ్, దేవేందర్, కిషన్, సమీర్, ఫారూఖ్, నవీన్ పాల్గొన్నారు.

బాధిత కుటుంబసభ్యులకు పరామర్శ



ఏర్గట్లలో బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న ముత్యాల సునీల్

ఏర్గట్ల, జూలై 21 (ఆంధ్రజ్యోతి): మండలకేంద్రానికి చెందిన బద్ధం లింగారెడ్డి ఇటీవల గుండెపోటుతో మృతిచెందగా విషయం తెలుసుకున్న బాల్కొండ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి ముత్యాల సునీల్‌కుమార్ సోమవారం బాధిత కుటుంబసభ్యులను పరామర్శించారు. అలాగే సాయన్న ఇటీవల మృతిచెందగా వారి కుటుంబాన్ని పరామర్శించారు. కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడు శివన్నోల్ల శివకుమార్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సోమదేవరెడ్డి, మాజీ ఎంపీటీసీ గడ్డం లింగారెడ్డి, గడ్డం జీవన్, దానం గంగమోహన్, కార్యకర్తలు పాల్గొన్నారు.

'జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్లు కల్పించాలి'

మోర్తాడ్ , జూలై 21 (ఆంధ్రజ్యోతి): కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు చట్ట సభ ల్లో జీపీలకు జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్‌లు కల్పించాలని తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ దాసరి మూర్తి డిమాండ్ చేశారు. సోమవారం మోర్తాడ్‌లో ఆయన విలేకరుల తో మాట్లాడారు. స్థానిక ఎన్నికల్లో 42 శాతం చట్టబద్ధమైన రిజర్వేషన్లు కల్పించాలని, ఇందు కు కేంద్రప్రభుత్వం అనుకూలంగా వ్యవహరించాలని ఆయన అన్నారు. బీసీ గురుకుల పాఠశాలలకు సొంత భవనాలు నిర్మించాలని, రాష్ట్రంలో వార్షిక బడ్జెట్‌లో ప్రతీ సంవత్సరం 50 శాతం బీసీలకు కేటాయించాలని ఆయన డిమాండ్ చేశారు. అంతేకాక ఈడబ్ల్యుఎస్ రిజర్వేషన్లు రద్దు చేయాలని ఐదుశాతం జనాభా లేని వారికి 10 శాతం రిజర్వేషన్లు కల్పించడం వలన బీసీలు అత్యధికంగా నష్టపోతున్నారన్నారు. మహిళా రిజర్వేషన్ బిల్లులు బీసీ మహిళలకు 50 శాతం సబ్‌కోట్ కేటాయించాలని డిమాండ్ చేశారు. మహిళా రిజర్వేషన్‌లలో బీసీ మహిళలకు 33 శాతం సబ్‌కోటా కల్పించాలని ఆయ న డిమాండ్ చేశారు. ఈనెల 28న జిల్లా కేంద్రంలోని న్యూ అంబేద్కర్ భవనంలో ఉమ్మడి నిజామాబాద్ జిల్లా బీసీల సమావేశం జరుగుతుందని, సమావేశానికి బీసీలు అత్యధికంగా తరలివచ్చి విజయవంతం చేయాలని దాసరిమూర్తి కోరారు.

ధర్పల్లి మండలంలో భూభారతిలో 2,252 దరఖాస్తులు

● టి.శాంత, తహసీల్దార్, ధర్పల్లి



ఫేస్‌టుఫేస్

ప్రశ్న: మండలంలో భూ భారతిలో భాగంగా నిర్వహించిన రైతు సదస్సుల్లో ఎన్ని దరఖాస్తులు వచ్చాయి?

తహసీల్దార్: మండలంలోని 20 గ్రామ పంచాయతీల పరిధి లో 2252 దరఖాస్తులు వచ్చా యి.

ప్ర: ప్రస్తుతం దరఖాస్తుల పరిశీలన ఏ విధంగా జరుగుతున్నాయి?

జ: ఇప్పటికే అర్హులైన 993 మంది రైతులకు నోటీసులు జారీ చేశాం. మిగతా రైతులకు సైతం నోటీసులు ఇచ్చి తదనంతరం విచారణ జరిపి వాస్తవ పరిస్థితులను వివరిస్తాం.

ప్ర: దరఖాస్తు చేసుకున్న రైతుల సమస్యలను ఎప్పటి వరకు పరిష్కరిస్తారు?

జ: రైతులు వివిధ విభాగాల ద్వారా దరఖాస్తులు చేసుకున్నారు. తమ పరిధిలోగల సమస్యల ను ఇక్కడే పరిష్కరించేందుకు ఏర్పాట్లు చేస్తున్నాం. ఆర్‌డీవో, కలెక్టర్‌కు చెందిన రైతు సమస్యలను సంబంధిత అధికారులకు పంపించాం. సాధ్యమైనంత వరకు సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తున్నాం.

ప్ర: మండలంలో ఇందిరమ్మ ఇళ్లకు ఇసు క, మొరం సమస్య ఏమైనా ఉందా?

జ: అన్ని గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్లు ప్రారంభం అయ్యాయి. గోవింద్‌పల్లి మినహా మిగతా గ్రామాల్లో ఇసుక కోసం సమస్యలు రాలేవు. గోవింద్‌పల్లిలో ఇసుక కోసం ప్రత్యేకంగా చొరవ తీసుకొని సాధ్యమైనంతవరకు ఒకటి రెండు రోజుల్లో ఇసుక పాయింట్‌ను ఏర్పాటు చేసి వారికి సైతం ఇసుకను అందించి త్వరితగతిన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి సహకరిస్తాం.

ప్ర: మండలంలో ఎన్ని రేషన్ కార్డులు ఉన్నాయి?

జ: మండలంలో 11వేల 348 రేషన్ కార్డులు ఉండగా కొత్త రేషన్ కార్డుల కోసం దరఖాస్తులను స్వీకరిస్తున్నాం. అర్హులైన వారు మీసేవా కేంద్రాలలో దరఖాస్తు చేసుకోవాలి. విచారణ జరిపి అర్హులైన వారందరికి రేషన్ కార్డులను అందించేందుకు కృషి చేస్తున్నాం.

● (ధర్పల్లి, ఆంధ్రజ్యోతి)

కొండెక్కిన కూరగాయల ధరలు

» సామాన్యులు కొనలేని పరిస్థితి

» నియంత్రణలో అధికారుల విఫలం

కోటగిరి, జూలై 21(ఆంధ్రజ్యోతి): జిల్లాలో కూరగాయల ధరలు రోజురోజుకు విపరీతంగా పెరుగుతున్నాయి. నెల రోజుల క్రితం నిలకడగా ఉన్న ధరలు ప్రస్తుతం రెట్టింపు అయ్యాయి. బీరకాయ, బెండకాయ, చిక్కుడు కాయ, కాప్సికం, మిర్చి, క్యాలీఫ్లవర్ వంటి కూరగాయల ధరలు సెంచరీ దాటాయి. ఇవి నెల క్రితం 40రూపాయలు పలకగా ప్రస్తుతం కిలో 80 నుంచి 100రూపాయల లోపు ఉండడంతో పేద, మధ్య తరగతి వారికి ఏం కొనాలో పాలుపోవడం లేదు. పెరిగిన ధరలతో పేదలు ఇబ్బందులు పడుతున్నారు.



కోటగిరిలో వారంతపు సంత దృశ్యం

● జిల్లాలో కూరగాయల సాగు అంతంతే

జిల్లాలో కూరగాయల సాగు అంతంత మాత్రంగానే ఉంది. వరుస నష్టాతో రైతులు కూరగాయల సాగుకు దూరమవుతున్నారు. ప్రభుత్వాలు రాయితీలు ఎత్తివేయడం, పెట్టుబడి పెరగడంతో ఉద్యాన సాగు భారంగా మారింది. దీనికి తోడు విత్తన, ఎరువులు, పురుగు మందుల ధరలు పెరిగాయి. జిల్లా రైతులు పంటలు సాగిన కూరగాయల పంట నిల్వ కోల్డ్ స్టోరేజీలు అందుబాటులో లేకపోవడంతో పలువురు బడా వ్యాపారులు కూరగాయల ధరలను విపరీతంగా పెంచుతున్నారు. దీంతో చిరు వ్యాపారులు ధరలు పెంచి కూరగాయలు వినియోగదారులకు అమ్ముతున్నారు. జిల్లాలో కూరగాయల పంటల సాగుకు సరైన సాగునీటి వసతులు లేకపోవడంతో రైతులు ఆసక్తి చూపని పరిస్థితి నెలకొంది. క్రమంగా సాగు విస్తీర్ణం తగ్గుతుండడంతో ఇతర ప్రాంతాల నుండి కూరగాయలు దిగుమతి చేసుకుంటున్నారు. తద్వారా అధిక భారం అవుతుందని వ్యాపారులు పేర్కొంటున్నారు.

● ఇబ్బందుల్లో పేదలు

వర్షాకాలం ప్రారంభమై నెల రోజులు గడిచిన ధరలు తగ్గకపోగా కొద్ది రోజులుగా ధరలు పెరుగుతున్నాయి. గడిచిన పదేళ్లుగా మే, జూన్, జూలై నెలల్లో కూరగాయల ధరలు చుక్కలు చూపిస్తున్నాయి. జిల్లాలో జూన్‌లో సాధారణ వర్షాలు కురిశాయి. అక్కడక్కడ టమాట, ఇతర కూరగాయల సాగు కోసం నారు పోశారు. జూలైలో వర్షాలు కురిస్తే కూరగాయలు సాగు చేసే అవకాశం ఉంది. సరైన వర్షాలు లేకపోవడంతో కూరగాయల సాగు సైతం అంతంతగానే మారే అవకాశం ఉంది. దీంతో ఇతర ప్రాంతాల నుండి కూరగాయలు బహిరంగ మార్కెట్‌కు, వారంతపు సంతలకు అధిక ధరలు వెచ్చించి తీసుకురావాల్సి వస్తుంది.

● జిల్లాలో కూరగాయల ధరలు

జిల్లాలో కూరగాయల ధరలు విపరీతంగా పెరిగాయి. టమాట గత నెలలో 30రూపాయలు ఉండగా ప్రస్తుతం 50రూపాయలకు పెరిగింది. బెండకాయ 30నుంచి 40, పచ్చిమిర్చి 80నుండి 100రూపాయలు, వంకాయ 40నుండి 80రూపాయల వరకు, కాకరకాయ 40నుంచి 80రూపాయలు, క్యాలీఫ్లవర్ 60నుంచి 100రూపాయలు, దొండకాయ 30నుంచి 60రూపాయలు, బీరకాయ 60నుంచి 100రూపాయలకుపైగా, చిక్కుడు కాయ 60నుంచి 100 రూపాయలకు పెరిగింది.

● బోధన్ డివిజన్‌లో

తగ్గిన కూరగాయల సాగు విస్తీర్ణం

బోధన్ డివిజన్‌లో కూరగాయల సాగు విస్తీర్ణం తగ్గింది. సాలూర మండలంలోని హున్స, మందర్నా, పోతంగల్ మండలంలోని పోతంగల్, జల్లాపల్లి, కొడిచర్ల, కోటగిరి మండలంలోని ఎత్తొండ, యాద్గార్‌పూర్, రుద్రూరు మండలంలోని రుద్రూర్, వర్ని మండలంలోని పలు గ్రామాల్లో కూరగాయల సాగు విస్తీర్ణం ఎక్కువగా ఉండేది. వర్షాకాలం సీజన్ ప్రారంభమైన నెలన్నర రోజులు కావస్తున్న సరైన వర్షాలు లేకపోవడంతో కూరగాయల సాగుకు రైతులు వెనుకాడుతున్నారు. మరోవైపు కూరగాయల సాగును ప్రోత్సహించడంలో, రాయితీలు కల్పించడంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండడం కూరగాయలు సాగు చేసే రైతులకు ఆశానిపాతంగా మారింది.

● సరిపడా కూరగాయలు కొనలేకపోతున్నాం

ఒడ్డెమ్మ, వ్యవసాయ కూలీ, వల్లభాపూర్



ప్రస్తుతం మార్కెట్‌లో కూరగాయలు ధరలు చూస్తుంటే భయంగా ఉంది. పొద్దంత కూలీ పని చేసిన ఇంటికి సరిపడా కూరగాయలు కొనలేకపోతున్నాం. రోజంత పని చేస్తే కూలీ 300రూపాయలు వస్తుండగా కూరగాయలు కొనడానికి అంతకు మించి ఖర్చు అవుతుంది. పెరిగిన కూరగాయల ధరలతో ఆర్థిక భారం పడుతుంది.

● కూరగాయల ధరలను నియంత్రించాలి

- స్వరూప, గృహిణి, కోటగిరి



ప్రస్తుతం కూరగాయల ధరలు విపరీతంగా పెరిగాయి. కూరగాయల ధరల నియంత్రణకు అధికారులు చర్యలు తీసుకోవాలి. పేద, మధ్య తరగతి ప్రజలు కూరగాయలు కొనలేని పరిస్థితి ఉంది. కిలోకు బదులు పావుకిలోతో సరిపెట్టుకోవాల్సి వస్తుంది.



గ్రామాల్లో, తండాల్లో చాటింపు దృశ్యం

పులులు తిరుగుతున్నాయి జాగ్రత్త

● ఫారెస్టు అధికారులు

రామారెడ్డి, జూలై 21 (ఆంధ్రజ్యోతి): రామారెడ్డి మండలం స్కూల్ తండా, గోకుల్ తండాల్లో పెద్దపులి, చిరుతపులి సంచరిస్తున్న విషయం అందరికి తెలిసిందే. కామారెడ్డి జిల్లా రామారెడ్డి మండలం స్కూల్ తండాలో గత శనివారం 110 ఆవులు ఉండగా కేవలం ఒకే ఆవును పెద్దపులి చంపేసింది. పెద్దపులి కోసం పది రోజులుగా ఫారెస్టు అధికారులు గాలింపులు చేపట్టారు. ఇది సంచారంతో ప్రజలు ఆందోళన నేపథ్యంలో జాగ్రత్తగా ఉండాలని అధికారులు నిర్వహిస్తున్నారు. పెద్దపులి, చిరుత పురుగులు తిరుగుతున్నాయి. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అత్యవసరమైతే తప్ప అడవి ప్రాంతాలకు వెళ్ళొద్దని అంటూ చాటిస్తున్నారు.

● పది రోజులుగా

గ్రామాల్లో, తండాల్లో హల్‌చల్

రామారెడ్డి మండలంలో పది రోజులుగా పెద్దపులి, చిరుత పులుల జాడ అడవి శాఖ అధికారులు అడవుల్లో గాలిస్తున్నారు. తాజాగా చిరుత పులి రామారెడ్డి మండలం గోకుల్ తండాలో లేగ దూడపై దాడి చేయడంతో గ్రామాల్లో, తండాల్లో ఇప్పటికే అడవిశాఖ అధికారులు నిర్వహిస్తున్నారు. ముఖ్యంగా అడవులు దగ్గర ఉన్న గ్రామాలు, తండాలు చాలా అప్రమత్తంగా ఉండాలని గ్రామాల్లో, తండాల్లో తిరుగుతూ సూచిస్తున్నారు.

● రాత్రి వేళ బయటకు రావద్దు

అత్యవసరమైతే తప్ప గ్రామస్తులు రాత్రి వేళల్లో బయటకు రావద్దని అటవీ శాఖ అధికారులు గ్రామాల్లో, తండాల్లో సూచిస్తున్నారు. రాత్రి వేళల్లో దాడులు చేసే అవకాశం ఉందని ప్రజలకు వివరించారు. ఇదే విషయాన్ని గ్రామాల్లో, తండాల్లో దండోరా ద్వారా, అడవి శాఖ అధికారులు మైకు ద్వారా ప్రజలకు తెలియజేశారు. ప్రజలు పోలీసులు ఫారెస్టు అధికారుల సలహాలు, సూచనలు, పద్ధతులు పాటించాలని ఫారెస్టు రేంజ్ అధికారి దివ్య పేర్కొన్నారు.

మొరం అక్రమంగా తరలిస్తున్న టిప్పర్‌లు పట్టివేత

డిచ్‌పల్లి, జూలై 21 (ఆంధ్రజ్యోతి): అక్రమంగా మొరం తరలిస్తు అనుమతులు లేకుండా తిరుగుతున్న రెండు టిప్పర్‌లను సోమవారం టాస్క్ ఫోర్స్ పోలీసులు పట్టుకున్నట్లు ఎస్సై ఎండీ షరీఫ్ తెలిపారు. టాస్క్‌ఫోర్స్ పోలీసుల ఫిర్యాదు మేరకు అక్రమ మొరం టిప్పర్‌లపై కేసు నమోదు చేశామన్నారు. దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

వెదురు సాగు.. బహు బాగు

» కేంద్ర ప్రభుత్వం ద్వారా 50 శాతం రాయితీ

» 30 ఏళ్ల వరకు దిగుబడి

» నేరుగా విక్రయించుకునే అవకాశం

ఏర్గట్ల, జులై 21 (ఆంధ్రజ్యోతి): వెదురు సాగు రైతులకు లాభదాయకంగా ఉంటుందని, సాగుకు ఉద్యాన శాఖ ద్వారా కేంద్ర ప్రభుత్వం రాయితీ కల్పిస్తోందని, వీటిని సాగు చేసుకొని నేరుగా విక్రయించుకొని లాభాలు పొందవచ్చని ఉద్యాన శాఖ అధికారులు తెలుపుతున్నారు. ఒక్కో రైతు గరిష్ఠంగా ఐదు ఎకరాల వరకు వీటిని సాగుచేసుకోవచ్చు. ఒక్కసారి సాగు చేస్తే 30 ఏళ్ల వరకు దిగుబడి వస్తుంది. ఆసక్తి ఉన్న రైతులకు 50 శాతం రాయితీ కేంద్ర ప్రభుత్వం ద్వారా రాయితీ పొందవచ్చు. వెదురు సాగుపై ఉద్యాన శాఖ బాల్కొండ డివిజన్ అధికారి రుద్ర వినాయక్ పలు అంశాలు ముందుంచారు. బ్లాక్ ప్లాంటేషన్‌లో వెదురు మొక్కలను రైతులు తమన పొలాల్లో పూర్తి విస్తీర్ణంలో ఎకరాకు 100 మొక్కలు నాటు కోవచ్చని, ఎకరా సాగుకు రూ. 40 వేల ఖర్చు కాగా అందులో ప్రభుత్వం 50 శాతం రాయితీని అందిస్తోందని, తొలి యేడాది రూ.10 వేలు, రెండో యేడాది 6 వేలు, మూడో యేడాది 4 వేలు రాయితీ కేంద్ర ప్రభుత్వం అందిస్తోందని తెలిపారు. అలాగే బౌండరీ ప్లాంటేషన్ పద్ధతిలో రైతులు పొలం గట్టు చుట్టూ ఎకరాకు 180 మొక్కలు నాటుకోవచ్చని, మొదటి యేడాది రూ.7వేల800, రెండో యేడాది 4వేల680, మూడో యేడాది రూ.3వేల120 రాయితీని ప్రభుత్వం అందిస్తుందని అధికారులు తెలుపుతున్నారు.

నాలుగో ఏడాది నుంచి ఆదాయం

ఎలాంటి రసాయన ఎరువులు, క్రిమి సంహారక మందు లను వినియోగించ కుండా బంజరు భూముల్లో తక్కువ నీటి తో వెదురు సాగు చేయవచ్చు. నాటిన నాలుగో ఏడాది నుంచి 30 ఏళ్ల వరకు ప్రతీ నెల ఎకరాకు 10 వేల ఆదా యం రైతులకు సమకూరు తుంది. ఇటీవల అడవి చెట్ల జాబితా నుంచి వెదు రును తీసేయడం వల్ల రైతులు వెదురు బొంగు లను మార్కెట్‌లో నేరుగా అమ్ముకోవడంతో పాటు మంచి లాభాలు పొందడానికి అవకాశాలున్నాయి.



వెదురు వనం



రుద్ర వినాయక్, అధికారి



అమ్మకానికి సిద్దంగా ఉన్న వెదురు



కోతకు సిద్దంగా ఉన్న వెదురు

ఆలూర్ వీడీసీ ఆధ్వర్యంలో వినాయక చవితి ఏర్పాట్లపై సమీక్ష

» అవాంచనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు నిబంధనలు

» ఇతర గ్రామాలకు ఆదర్శం



ఆలూర్‌లో సమావేశమైన వీడీసీ సభ్యులు, యువకులు

ఆర్మూర్, జూలై 21 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో సోమవారం గ్రామాభివృద్ధి కమిటీ ఆ ధ్వర్యంలో వినాయక చవితి ఏర్పాట్లపై సమీక్ష సమావేశం నిర్వహించారు. వినాయక చవితి సందర్భంగా ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరుగకుండా ఆలూర్ గ్రామాభివృద్ధి కమి టీ ముందస్తుగా నిబంధనలను విధించింది. వినాయక చవితి ఉత్సవాల సందర్భంగా ఊరేగింపు సమయంలో ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరుగకుండా ఉత్సవాల సమయంలో ఇబ్బందులు తలెత్తకుండా ఆలూర్ వీ డీసీ సభ్యులు వివిధ యువజన సంఘాలతో స మావేశం నిర్వహించింది. వినాయక చవితి ఊ రేగింపు సందర్భంగా పాటించవల్సిన నియమాలు, క్రమశిక్షణ అంశాలపై చర్చించి పలు నిర్ణయాలు తీసుకున్నారు. ఈ సమావేశంలో వీడీసీ అధ్యక్షుడు బార్ల ముత్యం రెడ్డి, నవనీత్, నరే ష్, గంగారెడ్డి, గంగాధర్, యువకులు, వీడీసీ స భ్యులు పాల్గొన్నారు.

బీమా.. మరో నాలుగేళ్లు ధీమా

కోటగిరి, జూలై 21 (ఆంధ్రజ్యోతి): ఆర్థికాభివృద్ధికి ప్రభుత్వం స్వయం సహాయక సంఘాల మహిళలకు రుణాలు ఇస్తుంది. ఆర్థికంగా బలోపేతం చేయడంతో పాటు వారి సంక్షేమానికి అనేక కార్యక్రమాలు అమలుపరుస్తుంది. ఇందిర మహిళ శక్తి పథకం ద్వారా కోటి మందిని కోటీశ్వరులుగా మార్చేందుకు కృషి చేస్తుంది. సంఘంలోని సభ్యురాలు ప్రమాదవశాత్తు మృతి చెందితే రూ.10లక్షల చొప్పున ఆర్థిక సహాయం అందించే ఉచిత బీమా పథకాన్ని గత ఏడాది నుంచి అమలు చేస్తున్నారు. ప్రభుత్వం తాజాగా ఈ పథకాన్ని మరో నాలుగేళ్ల పాటు అంటే 2029వరకు పొడిగించింది. సభ్యురాలైన మహిళ ప్రమాదవశాత్తు చనిపోతే బీమా కంపెనీ రూ.10లక్షల పరిహారం చెల్లించేది. ఇప్పుడు బీమా కంపెనీ నుంచి కాకుండా ప్రభుత్వమే రూ. 10లక్షల ఆర్థిక సాయం చేస్తుంది. ఇది మహిళలకు ఎంతో ఉపయోగపడనుంది.

● ప్రీమియం చెల్లించకుండానే..

ప్రమాద బీమా పథకానికి సభ్యులు ఎలాంటి ప్రీమియం చెల్లించాల్సిన అవసరం లేదు. సంఘంలో సభ్యురాలైతే చాలు ఈ పథకం వర్తిస్తుంది. పరిహారం కింద వచ్చిన మొత్తాన్ని సభ్యురాలి నామిని బ్యాంక్ ఖాతాలో జమ చేస్తారు. దీంతో పాటు రుణ బీమా పథకాన్ని అమలు చేస్తున్నారు. ఈ పథకం ఉచితమే. లోన్ బీమా పథకంలో స్త్రీనిధి నుంచి రుణాలు పొందిన వారు ఏ కారణంచేతనైన చనిపోతే వారు తీసుకున్న దాంట్లో గరిష్టంగా రూ.2లక్షలు మాఫీ చేసేవారు. అలాగే చెల్లించిన రుణ మొత్తాన్ని నామినికి తిరిగి చెల్లించే వారు. ప్రస్తుతం ఈ లోన్ బీమా పథకాన్ని బ్యాంకు లింకేజీ రుణాలు తీసుకున్న మహిళలకు వర్తింపజేస్తున్నారు. దీనికి ఎలాంటి ప్రీమియం చెల్లించాల్సిన అవసరం లేదు.

● కోటగిరి ఉమ్మడి మండలంలో 1,010 స్వయం సహాయక సంఘాలు ఉన్నాయి. ఇందులో సభ్యులు 10వేల మంది ఉన్నారు. సాధారణ రుణాలు 52కోట్లు ఇవ్వగా, స్త్రీనిధి కింద 7కోట్ల రూపాయల రుణాలు అందించారు. ప్రతి మహిళకు డ్వాక్రా రుణాలు అందించేలా ఐకేపీ అధికారులు కృషి చేస్తుండటం మహిళల ఆర్థిక స్వాలంబనకు దోహదపడుతుంది.

కంకర వేశారు.. రోడ్డు పనులు మరిచారు

» ఇబ్బందులు పడుతున్న నారాయణపేట్ గ్రామస్థులు



రోడ్డుపై కంకర పోయగా ఇరువైపులా పేరుకుపోయిన కంకర దృశ్యం

జక్రాన్‌పల్లి, జూలై 21 (ఆంధ్రజ్యోతి): రోడ్డుపై బీటీ రోడ్డు చేపట్టేందుకు కంకర పోసి నేర్చారు. దీంతో బీటీ రోడ్డు పనులు చేపట్టలేదు. వివరాల్లోకి వెళ్తే జక్రాన్‌పల్లి మండలం నారాయణపేట్ గ్రామంలో వెంకటేశ్వర్ ఆలయం నుంచి గ్రామం నుంచి అర్గుల్ వైపు వెళ్లే గ్రామం చివరి వరకు రోడ్డుపై బీటీ రోడ్డు చేపట్టేందుకు కంకర పోసి రోడ్డుపై నేర్చారు. ఈ రోడ్డుపై బీటీ రోడ్డు నిర్మాణ పనులు చేపట్టలేదు. గ్రామంలోకి రాగానే ఈ రోడ్డుపై ఇరువైపులా వెళ్లే వాహనదారులు, ప్రజలు, గ్రామస్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి కంకర వేసి ఉన్న ఈ రోడ్డుపై వెంటనే బీటీ రోడ్డు పనులు చేపట్టాలని ప్రజలు, గ్రామస్థులు కోరుతున్నారు.

పాముల కాలం.. జర జాగ్రత్త!



» వానాకాలంలో పొంచి ఉన్న ముప్పు

» విష పురుగులతో ప్రాణాపాయం

» ముందస్తు జాగ్రత్తలు తప్పనిసరి

రుద్రూరు, జూలై 21 (ఆంధ్రజ్యోతి): వానాకాలం ప్రారంభం కాగానే ఖాళీ స్థలాలు చిత్తడిగా మారుతాయి. నీటి మడుగులు ఏర్పడి కప్పలు సంచరిస్తుంటాయి. అంతేకాకుండా ఆ ప్రాంతంలో గడ్డి మొలుస్తుంది. ఈ క్రమంలో ఆయా ప్రదేశాల్లో విష పురుగులు సంచరించే అవకాశం ఉంటుంది. ఏ మాత్రం పొరపాటున ఉన్న కాటేసే ప్రమాదం ఉంటుంది. అందుకే అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉంది. ముఖ్యంగా రైతులు, కూలీలు అటవీ ప్రాంతాలకు దగ్గరగా ఉండే వారు నివాసాలకు సమీపంలో ఉన్న వారు జాగ్రత్తగా మెలగాలి. గ్రామీణ ప్రాంతాల్లో పాములు ఎక్కువగా సంచరిస్తుంటాయి. గుడ్లను ఈ కాలంలో పిల్లలను చేస్తాయి. కప్పలు కూడా బయటకు వచ్చే కాలం ఇదే అందుకు వాటిని వేటాడేందుకు పాములు తిరుగుతుంటాయి. అటవీ ప్రాంతాల్లో పొలం గట్లలో పొలాల్లో ఎక్కువగా తిరుగుతుంటాయి. మన ప్రాంతాల్లో తాచుపాము, కట్లపాము, రక్తపింజన తదితర విషపూరిత పాములు ఎక్కువగా ఉండగా వాటి కాటుకు గురైన బాధితులకు వెంటనే వైద్యం అందకపోతే ప్రాణాలు పోయే ప్రమాదం కూడా ఉంటుందని వైద్యులు చెబుతున్నారు.

● పాము ఎప్పుడు కాటేస్తుంది అంటే..

పొలం గట్లు, కాలువ గట్లు, పశువుల పాకలు, గుబురు ప్రదేశాలు, పొదలు, గడ్డివాములు, పాడుబడిన ఇల్లు, కట్టెలు, పెంటదిబ్బల్లో విష పురుగులు, బల్లులు, తొండలను వేటాడి తింటాయి. ఇలాంటి ప్రాణులు అక్కడ ఎక్కువగా సంచరిస్తుంటాయి. పాములు కూడా అక్కడే తిష్టవేసి స్థాయి పాములకు చెవులు వినపడటం అప్పటికి వాటి శరీరం కింద ఆ భాగంగా ఉండే ప్రత్యేక శబ్దం ప్రకంపనలను గ్రహిస్తాయి. వేడి ప్రవహించే జంతువులు మనుషులు గుర్తించి కాటేస్తాయి. సాధారణంగా పంట పొలాల్లో తిరిగే పాములు చాలా వరకు విషపూరితం కావు. పాములకు ప్రాణ భయం ఉన్నప్పుడు ఏకాంతానికి భంగం కలిగినప్పుడు వాటిని వేటాడేటప్పుడు మాత్రమే కాటేస్తాయి.

● పాముల విష ప్రభావం

కట్ల పాము కాటేసిన క్షణాల్లో విషం రక్త కణాల్లో కలుస్తుంది. ప్రమాద తీవ్రతను దృష్టిలో ఉంచుకుని వెంటనే ఆసుపత్రిలో చేర్చాలి. నాగు పాము కాటేసిన 15 నిమిషాల్లో శరీరంలోకి విషం ఎక్కుతుంది. రక్తపింజర కాటేసిన రెండు గంటల తర్వాత విషం శరీరంలోకి ఎక్కుతుంది. అలాగే జెర్రిపోతు విషం ఉండదు. అయితే కాటు వేసిన చోట చికిత్స చేయించడానికిఆసుపత్రికి తీసుకెళ్లాలి.

● విష పూరిత పాము కరిస్తే కనిపించే లక్షణాలు

శరీరమంతా నీలి రంగులోకి మారుతుంది. రక్తపోటు తక్కువగా ఉంటే స్పృహ కోల్పోతారు. పాము కరిచిన చోట నొప్పి వాపు ఉంటుంది. కొందరిలో పొక్కులు దద్దుర్లు కనిపిస్తాయి. నోటి నుంచి నురుగు వస్తుంది. ఆయాస పడతారు. శరీరమంతా చెమటలు పట్టి కోమాలోకి వెళ్తారు. గుండె సాధారణ స్థాయి కన్నా రెట్టింపుగా కొట్టుకుంటుంది.

● తీసుకోవాల్సిన జాగ్రత్తలు

● రాత్రి సమయాల్లో పొలాల్లో తిరిగే వాళ్లు అక్కడ నిద్రించే వారు టార్చ్‌లైట్ ఉంచుకోవాలి.

● ఎప్పటికప్పుడు పరిసరాలను పరిశుభ్రం చేసుకోవాలి.

● పెట్రోల్, కిరోసిన్, వెల్లుల్లి వాసనకు పాములు భరించలేవు. పాములు ఎక్కువగా ఉండే చోట సమయానుకూలంగా వీటిని ఉపయోగించాలి.

● రాత్రి సమయంలో గడ్డివాములో రోజు తిరిగే రైతులు కూలీలు మోకాళ్ల దాకా రబ్బరు బూట్లు ధరించడం మంచిది.

● గడ్డిలో పని చేసేవారు తొడగాలి.

● ఇల్లు కార్యాలయాల్లో పొదలు లేకుండా చూసుకోవాలి.

● పాము కాటుకు గురైన వ్యక్తి ఆందోళన చెందకుండా ఉండాలి. పక్కన ఎవరైనా ఉంటే బాధితులకు ధైర్యం చెప్పేందుకు ప్రయత్నించాలి.

● కాటు వేసిన పైభాగంలో వెంటనే తాడు గుడ్డతో లేదా గడ్డితో కొంత శరీరంలో రక్త సరఫరా కాకుండా బిగించి కట్టాలి.

● కాటు వేసిన శరీరంపై భాగంలో పదునైన బ్లేడ్‌తో కాటు చేసి ఈ రక్తం కారనివ్వాలి.

● పాముకాటుకు గురైన వ్యక్తిని నిపించవద్దు. పరుగు పెట్టించవద్దు.

● పసర్లు నాటు మందులు మాత్రలు అని కాలయాపన చేయకుండా తక్షణమే దగ్గరలో ఉన్న ఆసుపత్రికి తీసుకెళ్లాలి.

● పాముకాటుకు గురైన వారు ఆసుపత్రిలోకి వెళ్లి ఏ పాము కరిచింది. స్పష్టంగా చెబితే దానికి సంబంధించిన చికిత్సను ప్రారంభిస్తారు.

పాము కరిచినప్పుడు ఆందోళన చెందవద్దు

- డాక్టర్ ఆయేషా సిద్దిఖీ, రుద్రూర్ వైద్యాధికారి



పాము కాటుకు గురైన వ్యక్తి ఆందోళన చెందవద్దు. ఆసుపత్రిలో పాముకాటుకు సంబంధించిన యాంటీ స్నేక్ వినయ్ ఇంజక్షన్లు అందుబాటులో ఉన్నాయి. పాము కరిచిన వెంటనే ఆలస్యం చేయకుండా ఆసుపత్రికి తీసుకెళ్లాలి. ముఖ్యంగా వర్షాకాలంలో పాములు ఎక్కువగా సంచరిస్తాయి. ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. రైతులు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలి.



గాంధారిలో రేషన్‌కార్డును అందజేస్తున్న దృశ్యం

లబ్ధిదారులకు రేషన్ కార్డుల పంపిణీ

గాంధారి, జూలై 21 (ఆంధ్రజ్యోతి): మండలంలో లబ్ధిదారులకు మంజూరైన రేషన్‌కార్డులను సోమవారం పంపిణీచేశారు. అన్ని గ్రామాల్లో ఈ రేషన్‌కార్డుల పంపిణీ కార్యక్రమం చేపట్టారు. రేషన్‌కార్డు లేని పేదలకు రాష్ట్ర ప్రభుత్వం రేషన్‌కార్డులు మంజూరు చేసిందని ఏఎంసీ చైర్మన్ పరమేష్ తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ రేణుకచౌహన్, డీసీసీబీ జిల్లా డైరెక్టర్ సాయికుమార్, ఏఎంసీ వైస్ చైర్మన్ ఆకుల లక్ష్మన్, మాజీ సర్పంచ్ సంజీవ్, కార్యదర్శి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

25 సీసీ కెమెరాల ప్రారంభం



సీసీ కెమెరాలను ప్రారంభిస్తున్న ఏఎస్పీ

కామారెడ్డిటౌన్, జూలై 21 (ఆంధ్రజ్యోతి): జిల్లాకేంద్రంలోని దేవునిపల్లి వార్డులో సోమవారం 25 సీసీ కెమెరాలను ఏఎస్పీ చైతన్యరెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అసాంఘిక కార్యకలాపాలు, దొంగతనాలను అరికట్టేందుకు సీసీ కెమెరాలు ఎంతగానో ఉపయోగపడుతాయని తెలిపారు. ఏదైనా నేరం జరిగినప్పుడు సాంకేతికతో వివరాలు సేకరించేందుకు వీలుగా ఉంటుందని వివరించారు. కార్యక్రమంలో సీఐ రామన్, ఎస్‌ఐ రంజిత్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో మొదలైన వనభోజనాలు



రెడ్డిపేట్‌లో వన భోజనాల్లో గ్రామస్థులు

రామారెడ్డి, జూలై21 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని పలు గ్రామాల్లో గ్రామస్థులు వన భోజనాలు చేస్తున్నారు. మండలకేంద్రంతోపాటు రెడ్డిపేట్, మద్దికుంట, అన్నారం, పోసానిపేట్, గిద్ద, కన్నాపూర్, ఇసన్నపల్లి, ఉప్పల్వాయి గ్రామాల్లో గ్రామ దేవతలైన ఎల్లమ్మ, మైసమ్మ, పోచమ్మలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. వర్షాలు కురవాలని, పంటలు బాగా పండాలని మొక్కుకున్నారు. అనంతరం గ్రామ శివారుల్లోని ఆలయాల వద్దకు వ్యవసాయ భూముల్లో వంటలు చేసుకుని కుటుంబ సభ్యులు ఆనందంగా వేడుకలు నిర్వహించారు.

పోతాయిపల్లి పెద్దమ్మ ఆలయంలో చోరీ

● పుస్తెలు, హుండీలోని నగదు అపహరణ



పెద్దమ్మ ఆలయం ఇదే..

లింగంపేట, జూలై 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పోతాయిపల్లి పెద్దమ్మ ఆలయంలో ఆదివారం రాత్రి చోరీ జరిగినట్లు గ్రామ ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు సంద బాలయ్య తెలిపారు. దొంగలు అమ్మవారికి చెందిన మూడు పుస్తెలు, యాంప్లీఫైర్, హుండీలోని నగదును ఎత్తుకెళ్లినట్లు తెలిపారు. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు వెల్లడించారు.

చెరువులో దూకి ఒకరి ఆత్మహత్య

కామారెడ్డిటౌన్,జూలై21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చిన్నమల్లారెడ్డి గ్రామంలోని చెరువులో సోమవారం ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నట్లు దేవునిపల్లి ఎస్సై రంజిత్ తెలిపారు. రాజంపేట గ్రామానికి చెందిన గొడుగు సుధాకర్ (30) ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతూ చెరువులో దూకి ఆత్మహత్య చేసుకున్నట్లు తెలిపారు. మృతుడి కుటుంబీకులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

చికిత్స పొందుతూ ఒకరి మృతి

భిక్కనూరు, జూలై 21 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ సోమవారం మృతిచెందినట్లు ఎస్సై ఆంజనేయులు తెలిపారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ భిక్కనూరు మండలకేంద్రంలో ఆదివారం జరిగిన రోడ్డుప్రమాదంలో తీవ్రంగా గాయపడిన రాజేందర్ హైదరాబాద్‌లో చికిత్స పొందుతూ మృతిచెందారని అన్నారు. కేసు నమోదు చేసి పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని తరలించినట్లు తెలిపారు. కాగా రాజేందర్ మృతిచెందగా ఆయన మృతికి కారణమైన భిక్కనూరుకు చెందిన వ్యక్తి తమ కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేయగా కొద్దిసేపు ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. మృతుడి కుటుంబానికి రూ.3.50లక్షలు ఇవ్వడానికి అంగికరించగా బాధిత కుటుంబసభ్యులు ఆందోళన విరమించారు.

ఆలయం వద్ద మొక్కలను నాటిన నాయకులు

రామారెడ్డి, జూలై 21 (ఆంధ్రజ్యోతి): మండల మెడికల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో లక్ష్మీ నరసింహస్వామి ఆలయం వద్ద మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం ఆలయం వద్ద మొక్కలను నాటారు. ఈ సందర్భంగా వర్షాకాలంలో వర్షాలు సక్రమంగా పడాలని, పంటలు బాగా పండాలని, వ్యాపారాలు సమృద్ధిగా అభివృద్ధి చెందాలని పలు రకాల మొక్కలు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమంలో మండల మెడికల్ అసోసియేషన్ నేతలు నవీన్, రాకేష్, కుమార్, మారుతి, రాజు, గంగాధర్, శంకర్, ఉమ, నాగరాజు పాల్గొన్నారు.

మొక్క నాటుతున్న దృశ్యం





బీర్కూర్ నుంచి తిమ్మాపూర్ వరకు ఇరువైపులా వృక్షాలు



తిమ్మాపూర్ నుంచి నసురుల్లాబాద్ వరకు వృక్షాలు

ఆహ్లాదాన్ని పంచుతున్న హరితహారం వృక్షాలు

బీర్కూర్, జూలై21 (ఆంధ్రజ్యోతి): హరితహారంలో నాటిని మొక్కలు నేడు వృక్షాలై ఆహ్లాదాన్ని పంచుతున్నాయి. గత బీఆర్ఎస్ హయాంలో చేపట్టిన హరితహారం కార్యక్రమం నేడు ఫలితాలు ఇస్తోంది. రహదారులకు ఇరువైపులా నాటిన మొక్కలు ఎదిగి ప్రయాణికులకు ప్రాణవాయువును అందిస్తూ ఆహ్లాదాన్ని పంచుతాయి. బీర్కూర్ నుంచి నసురుల్లాబాద్ వరకు రహదారికి ఇరువైపులా వేలాది మొక్కలు నాటారు. వాటిని కంటికి రెప్పలా రక్షిస్తూ నీళ్ల పెడుతూ పెంచి సంరక్షించారు. అయితే ప్రస్తుతం అవి రహదారికి ఇరువైపులా పెద్దగా ఎదిగి రహదారికి గొడుగుగా మారాయి. ఈ రహదారి గుండా ప్రయాణించే వారికి ఎండా తాకకుండా గోడుగుగా మారి నీడను అందిస్తున్నాయి. ప్రయాణికులకు సైతం పచ్చటి వృక్షాల కింద ప్రయాణిస్తూ ఎంజాయ్ చేస్తున్నారు. బీర్కూర్, తిమ్మాపూర్, నసురుల్లాబాద్ గ్రామాల అధికారులు, సిబ్బంది, వృక్షాలను కాపాడుతూ బాధ్యతగా నిర్వహిస్తున్నారు.



మొక్కలు నాటుతున్న రోటర్లీక్లబ్ సభ్యులు

మొక్కలను నాటి సంరక్షించాలి

కామారెడ్డిటౌన్, జూలై 21(ఆంధ్రజ్యోతి): రోటరీక్లబ్ ఆఫ్ కామారెడ్డి ఆధ్వర్యంలో సోమవారం మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. జిల్లాకేంద్రంలోని మార్కండేయ ఆలయ ప్రాంగణంలో రోటరి గవర్నర్ ఎస్‌వీ రాంప్రసాద్,అసిస్టెంట్ గవర్నర్ జైపాల్‌రెడ్డిలు మొక్కలు నాటారు. ఆతర్వాత ఇతర ప్రాంతాల్లోసైతం రాగి, వేప, మేడి, జువ్వి మొక్కలు వందవరకు నాటామని తెలిపారు.మొక్కలను నాటడంతో పాటు సంరక్షణ చర్యలు తీసుకుంటామని తెలిపారు.ఈ కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు శంకర్, కార్యదర్శి కృష్ణహరి, ట్రెజరర్ రమణ, సభ్యులు రాజనర్సింహారెడ్డి, శ్రీశైలం, నాగభూషణం, కాశీనాథం, కాశీనాథరావు, దత్తాద్రి తదితరులు పాల్గొన్నారు.

సొసైటీ అధ్యక్షురాలిగా పరిగె మంజుల జనార్ధన్‌రెడ్డి

బాన్సువాడటౌన్, జూలై21 (ఆంధ్రజ్యోతి): బాన్సువాడ సొసైటీ చైర్మన్ ఎర్వల కృష్ణారెడ్డి అమెరికా పర్యటన సందర్భంగా సంఘ ఉపాధ్యక్షురాలు పరిగె మంజుల జనార్ధన్‌రెడ్డి అధ్యక్షురాలిగా సోమవారం బాధ్యతలు చేపట్టారు. సంఘ ఆర్థి లావాదేవీలు, కార్యకలాపాలు నడిపించేందుకు కార్యవర్గ సభ్యులు ఏకగ్రీవ తీర్మానం చేశారు.

అనర్హులకే డబుల్ బెడ్‌రూం ఇళ్ల కేటాయింపులు!

● అర్హులకు దక్కడం లేదని ఆరోపణలు

రాజంపేట, జూలై 21 (ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని డబుల్‌బెడ్‌రూం ఇళర్ల అనర్హులకు కేటాయింపులు జరుపుతున్నారంటూ గ్రామస్థులు ఆరోపిస్తు న్నారు. ఇటీవల డబుల్‌బెడ్‌రూం ఇళ్ల నిర్మాణంలో భాగంగా మౌలిక వసతుల కోసం ప్రత్యేక నిధులు మంజూరు కావడంతో సంబంధిత కాంట్రాక్టర్ పనుల్లో వేగం పెంచాడు. అధికారులు సైతం అర్హుల జాబితా సిద్ధం చేసే పనిలో ఉన్నారు. ప్రభుత్వం ఏ క్షణమైన ఎన్నికల షెడ్యూల్ వెలువడే అవకాశం ఉండడంతో ఇటీవల రైతువేదికలో డబుల్‌బెడ్‌రూం ఇళ్ల కేటాయింపుల జాబితాను అధికారులు చదివి వినిపించారని పలువురు పేర్కొంటున్నారు. అయితే జాబి తాకు సంబంధించి పలువురు పెదవి విరుస్తూ సోషల్‌మీడియాలో ఆరోపణలు గుప్పిస్తున్నారు. అనర్హులకు ఎక్కువగా కేటాయింపులు జరిపారని, అసలైన వారికి దక్కడం లేదని ఆరోపించారు. ఈ విషయంపై అధికారులకు సంప్రదించగా అందుబాటులోకి రాలేదు.



సదస్సులో పాల్గొన్న దృశ్యం

బీసీలు ఐక్యంగా ఉండి విజయం సాధించాలి

రామారెడ్డి, జూలై21 (ఆంధ్రజ్యోతి): సమస్యల సాధన కోసం బీసీలు ఐక్యతతో ఉండి విజయం పొందాలని ఆలోచన సాధన కమిటీ అధికార ప్రతినిధి మంగలిపల్లి శంకర్ పేర్కొన్నారు. సోమవారం బీసీలు ఏకతాటిపై వచ్చి రాజ్యాధికారం సాధించే దిశగా అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐక్యతతో ఉన్నప్పుడే విజయం పొందుతారని తెలిపారు. సమావేశంలో అధికార ప్రజాపతి మంగలిపల్లి శంకర్, సిలువేరు శంకర్, పూసరవి, దువ్వల శ్రీకాంత్, పిప్పరి లింబాద్రి దండబోయిన సిద్దిరాములు, పొట్టి గారి విజయ్, నామాల గంగాధర్, పిప్పరి జగన్, ఎల్లుల్ల దిగంబర్, పెద్ద బోయిన గంగాధర్ పాల్గొన్నారు.

శనేశ్వరాలయంలో ప్రత్యేక పూజలు

రామారెడ్డి, జూలై 21 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రానికి పది కిలో మీటర్ల దూరంలో ఉన్న రామారెడ్డి మండల కేంద్రం - ఇసన్నపల్లి గ్రామాల మధ్య దక్షిణ కాశీగా విరాజిల్లుతున్న శ్రీ కాలభైరవ స్వామి ఆలయంలో ఆవరణలో ఉన్న శ్రీ శనేశ్వరుడి ఆలయంలో సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ గర్భగుడిలో ఉన్న ఆలయంలో ప్రత్యేక పురోహితులు శ్రీనివాస్ శర్మ మంత్రోచ్చారణలతో ప్రత్యేకంగా పాలాభిషేకం, సంతత ధారాభిషేకం, సింధూర, ప్రత్యేక పూజలు నిర్వహించారు. కామారెడ్డి జిల్లాతో పాటు రాష్ట్ర రాజధాని హైదరాబాద్, నిజామాబాద్, కరీంనగర్, వరంగల్, ఖమ్మం, రాజన్న సిరిసిల్ల, మెదక్, పెద్దూరు, సిద్దిపేట, జగిత్యాల తదితర ప్రాంతాలకు చెందిన భక్తులు తదితరులు హాజరయ్యారు. పురుషులు ఆలయ సమీపంలో ఉన్న బావి వద్ద స్నానాలు చేసి దైవదర్శనం చేసుకున్నారు. చేసిన తప్పులు, పాపాలు పోతాయని దేవునికి మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో ఆలయ ఈవో బుర్ర ప్రభురాం చంద్రం గుప్తా, రాజకీయ నాయకులు, వ్యాపారులు, మేధావులు, వైద్యులు, ఆలయ జూనియర్ అసిస్టెంట్ లక్ష్మణ్, సిబ్బంది నాగరాజు, భక్తులు, యువకులు తదితరులు పాల్గొన్నారు.

శివాలయాల్లో ప్రత్యేక పూజలు

రామారెడ్డి, జూలై21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మద్దికుంట గ్రామ శివారులోని శ్రీబుగ్గ రామలింగేశ్వర స్వామి, పోసానిపేట్ గ్రామంలో రాజేశ్వరాలయంలో సోమవారం ప్రత్యేకపూజలు నిర్వహించారు. ఆలయ పురోహితులు గర్భగుడిలో పాలాభిషేకం, సింధూర, ప్రత్యేక పూజలు పూజలు నిర్వహించారు. ప్రత్యేక క్యూ ద్వారా ప్రసాదాలను పంచారు అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయాల పురోహితులు జంగం ప్రభాకర్ స్వామి, గణేష్ స్వామి, దిలీప్ స్వామి, ఆలయాల చైర్మన్లు లచ్చిరెడ్డి, మహిపాల్‌రెడ్డి, ధర్మకర్తలు, నాయకులు పాల్గొన్నారు.

రాజంపేట్‌లో పారిశుధ్య పనులు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్



రాజంపేటలో మురికికాలువను శుభ్రం చేసిన పంచాయతీ సిబ్బంది



తలమడ్లలో చెత్తను తొలగిస్తున్న పంచాయతీ సిబ్బంది

రాజంపేట, జూలై21 (ఆంధ్రజ్యోతి): రాజంపేటలోని పలు గ్రామాల్లో పారిశుధ్యం లోపించిందనే విషయాన్ని సోమవారం 'ఆంధ్రజ్యోతి'లో 'సీజనల్ వ్యాధుల బారిన రాజంపేట ప్రజలు' అనేక శీర్షికన ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. రాజంపేటలో పారిశుధ్య చర్యలు చేపట్టారు. మండలకేంద్రంతోపాటు తలమడ్ల గ్రామంలో పేరుకుపోయిన చెత్తకుప్పలను కార్మికులతో తొలగించారు. మురికి కాలువలో ఉన్న చెత్తను శుభ్రం చేయించారు. వానాకాలం కావడంతో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని వెంటనే చర్యలు చేపట్టారు. గ్రామాలల్లో దోమలు వ్యాప్తి ఎక్కువగా ఉందని, దోమల మందును పిచికారీ చేయాలని ప్రజలు కోరుతున్నారు.



నినాదాలు చేస్తున్న ఉద్యమకారుల ఫోరం నాయకులు

'చలో గన్ పార్క్'ను జయప్రదం చేయాలి

మద్నూర్, జూలై 21 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ఉద్యమకారుల ఫోరం ఆధ్వర్యంలో నేడు మంగళవారం చేపట్టనున్న చలో గన్‌పార్క్ కార్యక్రమాన్ని భారీగా తరలివచ్చి జయప్రదం చేయాలని మద్నూర్ మండల ఫోరం అధ్యక్షుడు తూమ్ హన్మండ్లు కోరారు. సోమవారం మండల కేంద్రంలో ఆయన మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమకారులకు ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ఇంటిస్థలం, నెలవారి పెన్షన్, ప్రభుత్వ పథకాల్లో 20శాతం రిజర్వేషన్, ఉచిత బస్‌పాస్, హెల్త్‌కార్డు, ఉద్యమకారుల కోసం హైదరాబాద్‌లో సంక్షేమ బోర్డు ఏర్పాటు తదితర హామీలు నెరవేర్చాలని డిమాండ్ చేస్తూ చలో గన్ పార్కు చేపడుతున్నట్లు వివరించారు. సమావేశంలో ఉద్యమకారులు మాలి శివరాం, పట్నాల్ గంగారం, పాకల విఠల్, పైడాకుల్ అంజయ్య, రాచూరే సుభాష్, మొగులాజీ పాల్గొన్నారు.

స్వచ్ఛతలో దిగజారిన ర్యాంకులు

(5వ పేజీ తరువాయి)

సేవలు అందుతున్నప్పటికీ పాతపట్టణంలో పరిస్థితి మారుమూల గ్రామాల కంటే హీనంగా తయారైంది. 100రోజుల పట్టణ ప్రణాళికను చేపడుతున్న అధికారులు అసలు పలు కాలనీలలో పనులు చేపట్టిన దా ఖాలాల్లేవు. ఒకేఅధికారి రాత్రింబవళ్లు సిబ్బందిని పర్య వేక్షిస్తూ పనులు చేయిస్తుంటాడే తప్ప ఎక్కడ ఇతర అధికారులు పట్టించుకున్న దాఖాలాలు కనిపించవు. వార్డులలో నెలకొన్న అపరిశుభ్రతపై వార్డు ఆఫీసర్లు ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేయాల్సి ఉన్నవారు కేవలం ఆస్తి పన్ను డిమాండ్ నోటీసులు ఇచ్చే సమయంలో, పన్ను వసూళ్లలో తప్ప ఏ వార్డులో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. పారిశుధ్యం ఎలా ఉందనేది కనీ సం పట్టించుకోవడం లేదనేది జగమెరిగిన సత్యం. వార్డు ఆఫీసర్‌లు పనిచేస్తే స్వచ్ఛత ర్యాంకు ఎందుకు దిగజారుతుందనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు స్పందించి మునిసిపల్‌లో నెలకొన్న సమస్యలు, అధికారుల పనితీరుపై పర్యవేక్ష ణ చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

సీఎంను కలిసిన మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్



రేవంత్‌రెడ్డికి కండువా కప్పుతున్న మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్

కామారెడ్డి, జూలై21 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లోని సీఎం రేవంత్‌రెడ్డి నివాసంలో కామారెడ్డి మాజీ మున్సిపల్ చైర్పర్సన్ ఇందుప్రియ మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డికి పుష్పగుచ్చం అం దించారు. సీఎం రేవంత్ రెడ్డి ధన్యవాదములు తెలిపారు. కాంగ్రెస్ బలోపేతానికి కృషిచేయాలని, ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలు ప్రజల్లోకి తీసుకెళ్లాలని సీఎం కోరినట్లు మాజీ మున్సిపల్ చైర్ పర్సన్ ఇందుప్రియ తెలిపారు. కామారెడ్డిలో పార్టీ పరిస్థితిని సీఎం తెలుసుకున్నట్లు తెలిపారు. కామారెడ్డి అభివృద్ధికి ప్రత్యేక నిధులు ఇవ్వాలనికోరగా, సీఎం సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు.

అధ్వానంగా బొమ్మన్‌దేవ్‌పల్లి క్రీడా ప్రాంగణం

నసురుల్లాబాద్, జూలై 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బొమ్మన్‌దేవ్‌పల్లి క్రీడాప్రాంగణం పిచ్చిమొక్కలతో దర్శనమిస్తోంది. వేసవి సెలవులలో విద్యార్థులు, గ్రామస్థులకు ఆటలు ఆడటానికి ఏర్పాటుచేసిన క్రీడా ప్రాంగణం చుట్టూ మొత్తం పిచ్చిమొక్కలు పెరిగి నిండిపోవడంతో గ్రామస్తులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. క్రీడా ప్రాంగణం కాస్తా పిచ్చిమొక్కలతో నిండిపోయిందని గ్రామస్థులు వాపోతున్నారు. అధికారులు స్పందించి క్రీడాప్రాంగణం చుట్టూ ఉన్న పిచ్చిమొక్కలను తొలగించాలని గ్రామస్థులు, యువకులు కోరుతున్నారు.

జాతీయ ఓబీసీ మహాసభ పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నాయకులు

కామారెడ్డిటౌన్, జూలై 21(ఆంధ్రజ్యోతి):కామారెడ్డి జిల్లా కేంద్రంలోని ఆర్ అండ్‌బీ అతిథిగృహంలో సోమవారం జాతీయ ఓబీసీ మహాసభ పోస్టర్లను జిల్లా బీసీ సంక్షేమ, విద్యార్థి సంఘ నాయకులు ఆవిష్కరించారు. 7న గోవాలోని శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ ఇండోర్ స్టేడియంలో జాతీయ ఓబీసీ మహాసభను పెద్దఎత్తున నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు నీలనాగరాజు, కుంబాల లక్ష్మన్ యాదవ్, కొత్తపల్లి మల్లన్న, మరికంటి భూమన్న, మోహన్‌చారి, నారాయణ రావు, అజీజ్, వెంకటి పాల్గొన్నారు.



దెబ్బతిన్న ద్విచక్ర వాహనాలు

ద్విచక్ర వాహనాలపైకి దూసుకెళ్లిన ఆర్టీసీ బస్సు

బాన్సువాడటౌన్, జూలై21 (ఆంధ్రజ్యోతి): బాన్సువాడ పట్టణంలో సోమవారం ఆర్టీసీ బస్సు బీభత్సం సృష్టించింది. ఈ ఘటనలో ఆరు ద్విచక్ర వాహనాలు పూర్తిగా దెబ్బతిన్నాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. సంగారెడ్డి డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు బాన్సువాడ వైపుకు వస్తుండగా ప్రధాన రహదారిపై గల డివైడర్‌ను ఢీకొట్టగా డ్రైవర్ వెంటనే బస్సు స్టీరింగ్‌ను ఎడమవైపునకు తిప్పడంతో పార్కింగ్ చేసిన ద్విచక్ర వాహనాలపై దూసుకెళ్లింది. డ్రైవర్ ఏ కారణంతో ఇలా చేశాడో స్థానికులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఘటన జరిగిన స్థలం కొద్ది దూరంలోనే ఆపిన డ్రైవర్ ఇలా బస్సు నడపటంపై పలువురు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ప్రజలు అప్రమత్తంగా ఉండడంతో పెద్దప్రమాదం తప్పినట్లైంది. ద్విచక్ర వాహనదారులు స్థానిక పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ అశోక్ తెలిపారు.

ఎస్సై మారినా బోర్డుపై పేరు మారలే!

నసురుల్లాబాద్, జూలై21 (ఆంధ్రజ్యోతి): నసురుల్లాబాద్ పోలీస్‌స్టేషన్‌లో ఎస్సైగా లావణ్య విధులు నిర్వహించి బదిలీపై రామారెడ్డి మండల కేంద్రానికి వెళ్లి వారం రోజులు గడుస్తోంది. అయినా మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్ బోర్డులో ఎస్సై పేరు మార్చకపోవడంతో మండల ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. కాగా నసురుల్లాబాద్ నూతన ఎస్సైగా బాధ్యతలు చేపట్టిన రాఘవేంద్ర పేరు పోలీస్‌స్టేషన్ బోర్డులో ఎక్కించాలని కోరుతున్నారు.



నసురుల్లాబాద్ పోలీస్‌స్టేషన్‌లో ఎస్సై పేరు మార్చని బోర్డు ఇదే..

సినిమా గైడ్ కామారెడ్డి



కామారెడ్డి

దర్శన్ - మై బేబీ
ప్రియా 70 - జూనియర్
ప్రియా 35 - కొత్తపల్లిలో ఒక్కప్పుడు

బాన్సువాడ

మహేశ్వరి - ఓ భామ అయ్యో రామ
వెంకటేశ్వర - జూనియర్

చికెన్ ధరలు



రకం	:	లైవ్	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
సుగుణ (కిలో)	:	180	220	240
వెన్‌కాబ్(కిలో)	:	130	160	190

